ప్రజాశక్తి
ఆదివారం అనుబంధం
అక్టోబర్ 12, 2014

అమరావతి...అద్భుతం...
మాలినీ భట్టాచార్య

సో...స్మార్ట్...

అమరావతి... అద్భుతం...!

మాలినీ భట్టాచార్య! పశ్చిమ బెంగాల్‌లోని జాదవ్‌పూర్ యూనివర్సిటీ ప్రొఫెసర్‌గా, ఎం.పిగా (రెండు సార్లు), జాతీయ మహిళా కమిషన్ సభ్యురాలిగా, రచయితగా సుపరిచితురాలు. జాదవ్‌పూర్ లోక్‌సభ నియోజక వర్గంలో (1989) తన ప్రత్యర్థి మమతా బెనర్జీని మట్టికరిపించిన నేత. అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం అధ్యక్షురాలిగా ... మహిళా సమస్యలపై పోరాడుతూ... నిత్యం బిజీగా వుండే నాయకురాలు. ఇన్నిటి మధ్యనా ... వ్యక్తిగత ఆసక్తులు, ఇష్టాయిష్టాల గురించి ఆమె మాటల్లోనే ...

అధ్యయనం

నేను అధ్యాపకురాలిని. టీచర్ ... తను బోధించే అంశానికి సంబంధించిన పుస్తకాలే కాక... అన్ని సబ్జెక్టులూ నిరంతరం చదవాలి. ప్రపంచం గురించి తెలుసుకోవాలంటే పుస్తకాలు చదవడం తప్పనిసరి. అన్ని రకాల పుస్తకాలను ఇష్టపడతాను. మరీ ముఖ్యంగా జ్ఞాపకాలు, పర్యాటక విశేషాలు తెలియచేసేవి, మానవాసక్తికరమైనవి, సాంఘిక విశ్లేషణలున్నవి.

కవిత్వం

పెర్సీ బి షెల్లీ

కవిత్వం అంటే ప్రత్యేకాసక్తి. బెంగాలీ కవులంటే ఇష్టం. అప్పుడప్పుడు కవిత్వం రాస్తుంటాను కూడా. అనువాదాలు చేస్తాను. బెంగాలీ నుంచి ఇంగ్లీషుకు.... ఇంగ్లీషు నుంచి బెంగాలీకి తర్జుమా చేస్తుంటాను. అభిమాన కవి... పెర్సీ బి షెల్లీ. ఆయన రాసిన సుదీర్ఘ కవితను ఈ మధ్యే అనువదించాను.

సయ్యద్ మీర్జా

సినిమాలు

ఇప్పుడంత సమయం వుండడం లేదుగానీ... నాటకాలన్నా... సినిమాలన్నా ఆసక్తి. సత్యజిత్ రే, రిత్విక్ ఘటక్, సయ్యద్ మీర్జా సినిమాలను ఇష్టపడతాను.

మాణిక్ బందోపాధ్యాయ

అభిమాన రచయితలు

రవీంద్రనాథ్ ఠాగూర్‌ను ఎవరు మాత్రం కాదనగలరు!? ఇక... మాణిక్ బందోపాధ్యాయ. బెంగాలీలో మరో మంచి నవలా రచయిత. వీరు కాక...యు.ఆర్. అనంతమూర్తి నవలలంటే ఇష్టం.

సంగీతం

అన్ని రకాల సంగీతాలను ఇష్టపడతాను. మరీ ముఖ్యంగా జానపద సంగీతం. బెంగాలీ జానపద కళాకారులతో సాన్నిహిత్యం వుంది. రాష్ట్రంలో వామపక్ష ప్రభుత్వం అధికారంలో వున్నప్పుడు జానపద కళాకారుల అభివృద్ధి కోసం ఒక పథకం కూడా వుండేది. అందులో భాగంగా వారుండే చాలా చోట్లకు వెళ్లాం.

పర్యటనలు

పాకిస్తాన్, చైనా, ఈజిప్ట్... దేశాలు చూశాను. మన దేశంలోకి వచ్చేసరికి... ఎన్నో ప్రదేశాలు చూశాను. అజంతా గుహల అందం మర్చి పోలేనిది. ఇప్పటికి ఐదారు సార్లు చూశాను. వెళ్లిన ప్రతిసారీ ఇదే చివరిసారి అనుకుంటా. కొండలమీద బాగా నడవాల్సి వుంటుంది మరి. ఇక అమరావతి! అద్భుతమైన అనుభవం. దాని గురించి చెప్పడానికి మాటలు సరిపోవు. పదిరోజుల కిందట చెన్నైలో ఓ మ్యూజియం చూశాను. చారిత్రక మూలాలు వున్న ప్రదేశాలను సందర్శించడమంటే ఆసక్తి.

వంట గురించి...

వంట చేయడం...తినడం రెండూ ఇష్టమే. అయితే ఇప్పుడు రోజూ వంట చేయడానికి కుదరడంలేదు. ఇష్టమైన పదార్థాలు చాలానే వున్నాయి. శాకాహారులం అయినప్పటికీ ... దేనిమీదా నిషేధం మాత్రం లేదు. రోజూ చేప ముక్క చిన్నది తింటుంటాను.

ఖాళీ సమయాల్లో...

సంగీతం వింటూ...పుస్తకాలు చదువుతూ...గడిపేస్తాను.

సంభాషణ: **- కె. అంజన**

(ఆంధ్రప్రదేశ్ ఐద్వా 13వ మహాసభల సందర్భంగా)

ప్రజాశక్తి
snehaweekly.praja@gmail.com

◆ మనలో మాట

నీడే నిజం

'ఏమి సేతురా లింగా...ఏమీ సేతూ... భార్యాబిడ్డలు... తల్లిదండ్రులు...బంధుమిత్రులు... ఎవరు వెంట వచ్చినా రాకున్నా... అసలంటూ వున్నా లేకున్నా.. నిన్ను వదలనిది ... నీ వెంటే వుండేది...ఒక్కటే నాన్నా ! నీ నీడ..'

'నీడానంద స్వామి... సూక్ష్మంలో మోక్షం అన్నట్టు గొప్పగా చెప్పేశారు. మరి నా మనసెరిగిన వారు మా అమ్మ ...బా.. బా .. ఏడుపు తన్నుకొచ్చేస్తుంది స్వామీ ... మా అమ్మ అంటే ఆ అమ్మ కాదు స్వామీ.. అందరి అమ్మ .. మా పురుచ్చితలైవి... ఎప్పుడు బయటికొస్తుందో సెలవివ్వండి స్వామీ...'

'ఏం అడిగావు లింగా! అక్కడ జుట్టుపీక్కుంటున్న జగజ్జెట్టీ న్యాయవాదికే తెలియడం లేదు. అయినా లింగా.. ఇదివరలో ఆమె సినిమాలు ఎప్పుడు విడుదల అవుతాయా అని ఎదురుచూశావు. ఇప్పుడు ఆమె ఎప్పుడు విడుదలౌతుందా అని చూస్తున్నావు. నిట్టూర్పులు నిలిపేసి నిరీక్షించాలి నాయనా...'

'అదే కదా స్వామీ మా బాధ. ఈ దేశంలో వేల కోట్లల్లో...గడ్డి కరిచిన వారు, బొగ్గు బొక్కినవారు, ఫోను లైన్లను మాయం చేసినవారు... దర్జాగా బయట తిరుగుతుంటే...మా అమ్మనెందుకు స్వామీ ... ముష్టికేసును ఇంతకాలం నడిపి .... చివరకు జైలుతోపాటు జరిమానా వేసి ... బెయిలుపైనా విడుదల చెయ్యమబోమంటున్నారు? ఇదేం న్యాయం నీడానందా..'

'దేనికైనా నిలుపూ నిదానం ప్రధానం లింగా! ముఖ్యమంత్రిగా వెలిగిన లాలూ ... మూడు నెలలు చిప్ప కూడు తిన్నాక కానీ బయటకు రాలేదు. మరో ముఖ్యమంత్రి ముద్దుల తనయ కనిమొళి కథా అంతే. కేంద్ర మంత్రి పదవి వెలగబెట్టిన రాజావారు పదిహేను నెలలకు గాని కారాగార విముక్తుడు కాలేదే.. మరో ముఖ్యమంత్రి కుమారుడైన జగనన్న పదహారు నెలల పాటు జైలు ఊచలతో పాటు రోజులూ వారాలు లెక్కపెట్టి పెట్టి తిక్క పుట్టిన తర్వాత గదా ...బెయిల్ దక్కింది. మరి నేవూ మీ పురుచ్చి వారం తిరక్కుండానే ... డీలా పడి గోల పెడితే కుదురుతుందా లింగ లింగా? ఆ అమ్మ చేసిన తప్పు మటుకు చిన్నదా... చితకదా... నాలుగు వారాలు నీడపట్టున అక్కడే వుండనీ లింగా...'

'స్వామీ...మీరు కూడా అదే మాట్లాడితే ఎలా స్వామీ. విడుదలయ్యే వీలు చెప్పమని కాళ్లావేళ్లా పడుతుంటే ...ఇలాంటి అపశకునపు మాటలు మాట్లాడతారేం స్వామీ.. అమ్మ ఎంత సేవ చేసింది జనానికి. అమ్మ టిఫిన్, అమ్మ మంచినీళ్లు, అమ్మ ఉప్పు, అమ్మ పప్పు, అమ్మ బియ్యం... ఎన్ని.. ఎన్నని చెప్పాలి స్వామీ...అమ్మ సేవలు? అంతటి సేవామూర్తికి... కటకటాల ప్రాప్తి అంటే కన్నీళ్లు ఆగడం లేదు స్వామీ...?'

'నాయనా లింగా! నీ నీడలాటి వాణ్ని... అమ్మ సేవలు చెప్పావే కానీ...లీలలు ప్రస్తావించవే! కొందరు నేతలు...తాము తింటూ...జనానికి కొద్దిగా విదిలిస్తుంటారు. మరికొందరేమో...తాము పీకల వరకూ మెక్కడమే కానీ...జనాన్ని తిననివ్వరు. ఇందులో మీ అమ్మ మొదటి తరగతి కావచ్చు గాని లింగా... అమ్మయినా... అయ్యయినా... అబ్బాయయినా... అమ్మాయయినా... అడ్డగోలుగా ఆస్తులు పెంచేసుకోవడం కరెక్టా లింగా? నేను ముందర చెప్పానే నీడ గురించి... ఆ నీడ ఇదే! నీడకు... బేడీలకు వున్న బంధం బలీయమైనది లింగా. అందుకే అమ్మ విడుదల తేదీ ఎప్పడనేది నీడమీదే ఆధారపడి వుంటుంది లింగా.

అయినా....అమ్మ గురించి మరీ ఎక్కువ వేదన చెందక యోగాసనాలు వేస్తూ... నీ నీడను కాపాడుకో నాయనా...సెలవ్... ఓం శ్శాంతిశ్శాంతిశ్శాంతి: జై పురుచ్చి తలైవి..' ❄

టపా

సార్థకత

పిల్లల కోసం పరితపించే వాళ్ల స్థితిగతులు, పరిస్థితులు అన్నీ పసికూన కోసం..కథలో అద్దం పడతాయి. నిజంగా పిల్లలు లేని వారి బాధ వర్ణనాతీతం. ముఖ్యంగా మహిళలు మానసికంగా చాలా కుంగిపోతారు. అనాథ పిల్లల్ని తెచ్చి పెంచుకుందామన్నా ఎన్నో ఆలోచనలు వెంటాడుతూ ఉంటాయి. చేసేది మంచి పనే అయినాగానీ సమాజానికి, బంధువులకు సమాధానం చెప్పుకోవాల్సిన పరిస్థితి వస్తుంది. ఏది ఏమైనాగానీ ఎవరో ఏదో అంటారని వెరసి భయపడకుండా ధైర్యంగా నిర్ణయం తీసుకుని అనాథ పిల్లల్ని పెంచడం కూడా చాలా గొప్ప విషయం. ఒకరి జీవితాన్ని నిలబెట్టడం, సార్థకతను చేకూర్చడం.. సమాజంలో ఓ గుర్తింపు తేవడం కోసం కృషి చేయడం.. ఇలాంటివన్నీ కూడా ఉన్నత విలువల్ని తెలియజేస్తాయి.

– బి. మాధవి, విజయవాడ.

పెద్దన్న పాచిక

ఈవారం కవర్‌స్టోరీలో మోడీ అమెరికా వెళ్లటం గురించి ఇవ్వటంతోపాటుగా అమెరికా దుష్ట బుద్ధిని తెలియజేసింది. అలాగే రాజకీయ పరిణామాల వల్ల దేశ భవిష్యత్, ఆపైన ప్రజలపై ఎలాంటి ప్రభావాలకు లోనయ్యేది బాగా తెలిసింది. ఇప్పుడు దేశ ప్రధానిగా ఉన్న నరేంద్రమోడీకి తొమ్మిదేళ్ల క్రితం అమెరికా ప్రభుత్వం వీసానే రద్దు చేసింది. తన దేశంలో అడుగు పెట్టడానికి వీల్లేదంటూ శాసించింది. కానీ ఇప్పుడు తను ఈ దేశ ప్రధాని కదా! ప్రధానితో సంబంధాలు మెరుగుపర్చుకోవడంతో ఆ దేశ ప్రయోజనాలు చేకూరుతాయనే దాంతోనే ఒబామా కూడా ఎర్ర తివాచీ పరిచి ఆహ్వానం పలికాడు. అంటే దీన్నిబట్టే అర్థం చేసుకోవచ్చేమో కదా.. అమెరికా ప్రయోజనాల కోసం అందితే కాళ్లు... అందకపోతే జుట్టూ పట్టుకుంటుందని.

–ఆర్. వెంకట్, రాజమండ్రి.

కవలల కళకళ

కేరళలోని కొడిని గ్రామం కవల పిల్లలకు పేరుగాంచింది. నిజంగా అది చదువుతుంటే వింతగా అనిపించింది. ఇంకా పూర్తి వైద్య సౌకర్యాలుంటే కొంతమంది కవలలు చనిపోయేవారు కాదని అక్కడి గ్రామస్తులే చెబుతున్నారు. అలాగే అక్కడ కవలలకు జన్మనివ్వడం ఎలా సాధ్యమౌతుందా అని వైద్యులకు కూడా అంతుచిక్కకుండా ఉంది. ఏదిఏమైనాగానీ కొడిని గ్రామం కవలలతో కళకళలాడుతోందన్నమాట. ఇక వింతలోకం, మిగతా శీర్షికలు కూడా ఆకట్టుకున్నాయి.

రామకృష్ణారెడ్డి, గుంటూరు.

అలా... అలల లోకంలో...

పిల్లలు, పెద్దలు ఎవరైనా ఇష్టపడకుండా ఉంటారా గోవాని! కానీ అక్కడికెళ్లాలంటే ఖర్చులు, సెలవులు అన్నీ కలిసి రావాలి కూడా..! రోజువారీ వత్తిళ్ల నుంచి బైటపడాలంటే మాత్రం అలా ఏదైనా సుందర ప్రదేశాన్ని సందర్శించాల్సిందే. అదే సముద్రతీరాలకెళితే ఏదో తెలియని అనుభూతి కలుగుతుంది. ఒక్క గోవానే కాదనుకోండి... మిగతా ఏ సముద్రతీరాలైనా సరే! అందుకే ఎవరైనాగానీ ఇంటి బడ్జెట్‌నిబట్టి ప్రయాణాలు ప్లాన్ చేసుకుంటారు. ప్రత్యేకంగా చెప్పుకోవాల్సిందేమంటే కొత్తగా గోవా వెళ్లాలనుకున్నవారు అక్కడ చూడదగ్గ ప్రదేశాల గురించి తెలుసుకొని వెళితే బాగుంటుంది. ఈవారం ఇచ్చిన వివరాలు అందుకు ఉపయోగపడేలా వున్నాయి.

– సురేష్, వైజాగ్.

ఈ సంచికలో....

స్మో... స్మార్ట్...

కవర్‌స్టోరీ — 14

స్మార్ట్ ఫోన్! యూత్ యావంతా దీని గురించే. ఇది పాకెట్‌లో వుంటే ఓకే! లేకపోతే... కొనేదాకా...నో నిద్ర. నో తిండి. రేటు గురించి డోన్ట్ కేర్. ఏ ఖర్చైనా మానుకునేందుకు రెడీ. బట్... 'స్మార్ట్' కావాల్సిందే. ఇదండీ పరిస్థితి. ఈ మేనియాలో పడి కొట్టుకుపోతోంది యువత. మార్కెట్ వుండాలేకానీ... అమ్మేవాడు మరింత రెచ్చిపోడూ. పోటీపడి మరీ ... మార్కెట్‌ని నింపేసి... మనీ చేసుకుంటున్నాడు. ఇటువంటప్పుడే మనం తెలివిగా వుండాలి. మార్కెట్‌కి వెళ్లక ముందే... కొనే వస్తువు గురించిన పూర్తి వివరాలు తెలుసుకోవాలి. జాగ్రత్తలూ తీసుకోవాలి.

విజయం	**4**
అద్భుతం ఆ చిన్నారి జననం	
సమ్‌థింగ్ స్పెషల్	**5**
పిశాచి బొమ్మల పండుగ	
సందర్భం	**6**
సంతోషంగా ఉండండి	
నవ్వుల్ పువ్వుల్	**7**
సీరియల్	**8**
ప్రేమ - విప్లవం	
పంజాబీ ప్రేమికుడు	**10**
వింతలోకం	**11**
గవ్వల గూడు	
ప్రత్యేకం	**12**
ఈ ఛండాలం... మాకొద్దు	
కథ	**18**
ప్రేమేరా అన్నిటికీ మూలం	
కార్టూన్ కదంబం	**20**
రుచి	**21**
పీతల స్పెషల్	
బాలనేస్తాలు	**22**
కొత్త పుస్తకాలు	**24**
శ్రీశ్రీ శ్రామిక వర్గ కవి	

మనసు ———— **13**

మీ సేవకై...

రంగురంగుల సుమాలు. రకరకాల మొక్కలు. పచ్చటి పచ్చికబయలు. ఇన్ని వున్న తోటల్లో అడుగెడితే... బయటికి రావాలనిపిస్తుందా ఎవరికైనా! ఈ ఆహ్లాదకరమైన వాతావరణం అస్సలు కదలనివ్వదు సరికదా. కూర్చోబెట్టేస్తుంది. అక్కడక్కడే కలియ తిరిగి ఆస్వాదించమంటుంది. మరి చూపులేని వారి సంగతి? అలాంటి వారికీ ప్రకృతిని దగ్గరగా చూపించే ప్రయత్నం చేస్తోంది చెన్నైలోని 'టచ్ అండ్ స్మైల్' ఉద్యానవనం.

అంధుల కోసం అందమైన వనం

పిల్లల కోసం, వృద్ధుల కోసం, మహిళల కోసం.. అంటూ సమాజంలోని వివిధ వర్గాలను లక్ష్యంగా చేసుకొని కొన్ని సంస్థలూ, దుకాణాలూ వస్తున్నాయి. కానీ 'అంధుల కోసం' అనేమాట అరుదుగా వినిపిస్తుంది. అలాంటి అరుదైన పనిని చెన్నైలోని 'ఎమ్.ఎస్.స్వామినాథన్ రీసెర్చ్ ఫౌండేషన్' చేపట్టింది. అదే 'టచ్ అండ్ స్మైల్' ఉద్యానవనం. ఫౌండేషన్ ఉన్న ప్రాంగణంలోనే అంధుల కోసం ఏర్పాటు చేసిన ఈ ఉద్యానవనంలో అనేక రకాల మొక్కల్ని పెంచుతున్నారు. చూపులేనివారు మొక్కల్ని తాకి, వాసన చూసి, బ్రెయిలీ లిపిలో అక్కడున్న వివరాలతో మరిన్ని కొత్త విషయాలు తెలుసుకుంటున్నారు.

సౌకర్యంగా...

ఉద్యానవనంలో అడుగుపెట్టగానే మల్లె సువాసనలు వెదజల్లుతుంది. తర్వాత ఒక్కో అడుగూ ముందుకు వెళ్తూ అక్కడున్న మొక్కల పరిమళాల్ని ఆస్వాదించవచ్చు. కొన్ని మొక్కల్ని కుండీల్లో పెట్టి వేలాడగట్టి ఉంచారు. ఆ కుండీలు ఉన్నచోట గుర్తుగా చాపల్ని నేలపైన పరిచి ఉంచారు. చాప ఉందంటే అక్కడ కుడి లేదా ఎడమవైపున కాస్త పక్కగా చెయ్యి పైకి ఎత్తితే తగిలేలా ఒక మొక్క ఉంటుందని అర్థం. దాన్ని తాకి, వాసన చూసి మొక్క ఆకారంతోపాటు ఇతర లక్షణాలూ తెలుసుకోవచ్చు. ఆ మొక్క ప్రత్యేకతల్ని బ్రెయిలీలో ఒక పలకపైన రాసి ఉంచుతారు. ఒకరి సాయం అవసరం లేకుండానే అంధులు ఈ ఉద్యానవనంలోకి వెళ్లవచ్చు. వారు తిరిగేందుకు అనుగుణంగా అన్ని ఏర్పాట్లూ చేశారు. ముఖ్యంగా దారి ఎక్కడ మొదలయ్యేదీ ఎక్కడ ఆగిపోయేదీ తెలుసుకోవడానికి ఆ దారుల అంచుల్లో గులక రాళ్లను పెట్టి నిర్మించారు. అంధులు చాలా విషయాలు ఎవరో చెప్పడం లేదా వినడం ద్వారా నేర్చుకుంటారు. కానీ ఇక్కడ వాళ్లు మొక్కల లక్షణాలను అనుభవపూర్వకంగా తెలుసుకుంటారు. వారిలోనూ సైన్స్ మీద ఆసక్తి పెంచాలనేది నిర్వాహకుల లక్ష్యం. సువాసనలు ఇచ్చేవి, ఔషధ మొక్కలు, వాణిజ్య విలువలున్నవీ ఇలా భిన్న రకాలైన మొక్కలు ఉన్నాయి. సువాసనలు వెదజల్లే వాటికి ప్రాధాన్యం ఇస్తారు. తులసి, రోజ్‌మేరీ, వాము, జెరానియమ్, పుదీనా వంటి ఔషధ మొక్కలతోపాటు లిల్లీ లాంటి సువాసనలిచ్చే పువ్వులూ అక్కడ కనిపిస్తాయి. సరస్సులు, నదీ ప్రాంతాల్లో పెరిగే తామరలాంటి వాటిని ప్రత్యేకమైన టబ్బులలో పెంచుతున్నారు. దీనివల్ల అంధ బాలలు సరస్సుల చుట్టూ తిరగకుండా ఆ మొక్కల గురించి తెలుసుకునేందుకు వీలు పడుతోంది.

బహుమతి వనం

ఎం.ఎస్.స్వామినాథన్‌కు 1999లో ఇందిరా గాంధీ శాంతి బహుమతి వచ్చింది. ఆ బహుమతి కింద వచ్చిన రూ. 25 లక్షలను 'ఎవ్రీ చైల్డ్ ఈజ్ ఏ సైంటిస్ట్' కార్యక్రమానికి కేటాయించి పిల్లలకు సైన్స్ అవగాహన తరగతులు ఏర్పాటు చేసేవారు. ఆ సమయంలో వివిధ దేశాల్లో ఉన్న 'టచ్ అండ్ స్మైల్' ఉద్యానవనాల గురించి స్వామినాథన్ విని మన దేశంలోనూ స్థాపించాలని నిర్ణయించుకున్నారు. లక్నోలోని 'నేషనల్ బొటానికల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్' వారినీ, చెన్నైలోని కొన్ని అంధుల పాఠశాలలనూ సంప్రదించాక 2002లో మన దేశంలోని మొట్టమొదటి అంధుల ఉద్యానవనానికి రూపకల్పన చేశారు. మొక్కల సమాచరమే కాదు భూతాపం లాంటి పర్యావరణ పరిరక్షణనూ తెలిపే మరికొన్ని అంశాల గురించీ సమాచారం ఉంది. ఈ ఉద్యానవనాన్ని ప్రారంభించిన తమిళనాడు ముఖ్యమంత్రి జయలలిత రూ. 10 లక్షలు నగదు అందించారు. దాన్ని బ్యాంకులో పొదుపు చేసి ఆ వడ్డీతో ఎప్పటికప్పుడు కొత్త మొక్కలు తెచ్చి నాటుతారు.

ఈ ఉద్యానవనం కారణంగా పదో తరగతి తర్వాత కూడా అంధ బాలలు సైన్స్ చదువు కొనసాగించే అవకాశాన్ని ఇచ్చాయి తమిళనాడులోని కొన్ని కాలేజీలు. ఈ స్పందనను చూసి వృక్ష శాస్త్ర పాఠ్యాంశాల్లో ఉండే అనేక మొక్కల్ని తెచ్చి ఈ వనంలో పెంచుతున్నారు నిర్వాహకులు. 'నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ విజువల్లీ హ్యాండీక్యాప్డ్'లో శిక్షణ తీసుకునే అంధ ఉపాధ్యాయుల పాఠ్యాంశాల్లో ఈ ఉద్యానవన సందర్శన ఒక భాగం. ఈ ఉద్యానవనానికి ఎవరైనా సందర్శకులు వస్తే వారికి అంధ విద్యార్థులే అన్నీ వివరించి చెబుతారు. ఇక్కడి అంశాల్ని బాగా అర్థం చేసుకున్న పిల్లలకు సర్టిఫికెట్‌లు కూడా అందిస్తారు. ఇక్కడ మొక్కల పెంపకం గురించి బాగా తెలుసుకుని ఉపాధి కోసం మొక్కల పెంపకాన్ని ఎంచుకున్న అంధులు ఒకరిద్దరు ఉన్నారు.

చెన్నైలో ఎండలు ఎక్కువ, వర్షాలు తక్కువ. అయినప్పటికీ ఎంతో శ్రమతో ఈ ఉద్యానవనాన్ని పెంచుతున్నారు. 'చాలా మొక్కల గురించి విన్నాం, చదివాం. కానీ వాటిని దగ్గర్నుంచి ఎప్పుడూ పరిశీలించలేదు. ఆ అవకాశం ఇక్కడ ఉంది. చదివినప్పటి కంటే ఎన్నో రెట్లు ఎక్కువగా ఆయా మొక్కల గురించి తెలుసుకోగలిగాను' అని చెబుతాడు చెన్నైకి చెందిన అంధ విద్యార్థి ముత్తయ్య. ఇక్కడకు వచ్చి కొన్ని కొత్త విషయాలు తెలుసుకున్న తర్వాత చూపు పెరిగినట్లు అనిపిస్తుందని చాలామంది చెబుతున్నారు. ఈ ఉద్యానవన సందర్శకుల్లో అంధులే కాదు సాధారణ విద్యార్థులూ ఉంటారు. ప్రతి పిల్లాడూ ఒక శాస్త్రవేత్తే కదా! ❄

డా॥ బ్రాన్ స్ట్రామ్

ఆ అబ్బాయి పేరు 'విన్సెంట్'. లాటిన్ భాషలో 'విన్సెంట్' అంటే 'విజయుడు' అని అర్థం. ఒక విజయవంతమైన వైద్య ప్రయోగంలో భాగంగా విన్సెంట్ జన్మించాడు. ఇక జీవితంలో మాతృత్వం పొందలేనని అనుకున్న ఒక మహిళ విన్సెంట్‌కి జన్మనిచ్చి విజయం సాధించింది. తన గర్భాశయం దానం చేసి మరొక మహిళకు మాతృత్వపు మధురిమలను పంచిన ఇంకో మహిళ విజయం సాధించింది. ఒక వయసు మళ్ళిన స్త్రీ నుండి గర్భాశయం తీసి, ఇంకొకరికి అమర్చి సంతాన భాగ్యం కలిగించడం లో స్వీడన్ వైద్య బృందం విజయం సాధించింది.

అద్భుతం! ఆ చిన్నారి జననం!

వైద్య రంగంలో అద్భుతాలు అడపా దడపా అగుపిస్తుంటాయి. ఇప్పుడు స్వీడన్‌లో అటువంటి అద్భుతమే చోటుచేసుకుంది. ముప్పై ఆరేళ్ళ ఒక మహిళ పుట్టుకతోనే గర్భాశయం లేకుండా జన్మించింది. అయితే... అరవై ఒక్క ఏళ్ళ మహిళ దానం చేసిన గర్భాశయంతో ఓ మగ బిడ్డకు జన్మనిచ్చింది. ఇలా గర్భాశయ మార్పిడి ద్వారా ఒక బిడ్డ కలగడం వైద్య చరిత్ర లోనే ఒక అద్భుత ప్రారంభం.

స్త్రీలలో రెండు అండాలు వుంటాయి. అవి ఒకదాని తరువాత ఒకటిగా నెలకో అండాన్ని విడుదల చేస్తాయి. ఆ అండాలు పురుష బీజంతో ఫలదీకరణ చెందక పోతే ఋతుచక్రంలో శరీరం బయటకి వెళ్ళిపోతుంది. ఒకవేళ ఫలదీకరణ చెందితే ఆ అండం గర్భాశయ గోడకు అతుక్కుని, కణవిభజన జరిగి పిండం గా మారి, శిశువు లా అభివృద్ధి చెందుతుంది.

స్త్రీలలో గర్భం రాకపోవడానికి ఈ ప్రక్రియలో అనేక అంశాలలో లోపాలు కారణాలుగా ఉంటాయి. వాటిలో ఒకటి గర్భాశయం లోపించడం, ఉన్నా అది పనిచేయక పోవడం. వీరిలో ప్రత్యుత్పత్తికి సంబంధించిన మిగతా ప్రక్రియలు, వాటి తాలూకు అవయవాలు అన్నీ సక్రమంగానే పని చేస్తూ ఉండొచ్చు. ఈ స్వీడన్ యువతిలో కూడా సక్రమంగా పనిచేసే అండాశయాలు వున్నా, ఆమె యుటెరస్ (గర్భాశయ) లోపంతో జన్మించింది. ఇటువంటి సమస్య సుమారు ఐదువేల మందిలో ఒకరికి ఉంటుంది. పిల్లలు పుట్టడానికి మిగతా అన్ని విధాల వైద్య ప్రక్రియలు జరిపిన తరువాత డాక్టర్లు గర్భాశయాన్ని మరో స్త్రీ నుండి తీసుకుని ఈమెలో అమర్చడం అనే ఒక ప్రయోగం చేద్దామని ఈ దంపతులకు తెలియచేసారు. అందుకు వీరు ఒప్పుకున్న తరువాత గర్భాశయ దాత కోసం అన్వేషణ ప్రారం భించారు. వీరి ఫామిలీ ఫ్రెండ్ ఒకావిడకి అరవై ఒక్క సంవత్సరాలు. ఇద్దరు పిల్లలు. ఆమెకి అప్పటికే అండోత్పత్తి ఆగి పోయింది (మెనోపాజ్). అంత వయసున్న గర్భాశయం ఉపయోగపడుతుందా అన్న అనుమానం కలిగినా, అది సంపూర్ణంగా ఆరోగ్యంగా ఉన్నందువల్ల దానిని వాడవచ్చు అని వైద్యులు నిర్ధారించారు.

గర్భాశయం లోపించిన మహిళకు అప్పటికే ఒక మూత్ర పిండం మాత్రమే వుంది. ఆమె లోకి కొత్త గర్భాశయం అమర్చిన ఆరు వారాలకి ఆమెకి ఋతుచక్రం మొదలయింది. కొత్త గర్భాశయం బాగానే పనిచేస్తుందని గ్రహించిన డాక్టర్లు ఆమె నుండి అండాలను సేకరించి వాటికి ఆమె భర్త వీర్యాన్ని కలిపి, రెండిటినీ లాబ్‌లో ఫలదీకరణ చేసి పదకొండు పిండాలను (ఎంబ్రియో) రూపొందిం చారు, వాటిని శీతలీకరించారు. ఒక సంవత్సరం తరువాత వాటిలో ఒక పిండాన్ని ఆమె గర్భాశయంలోకి ప్రవేశ పెట్టారు.

ఈ ప్రయోగం విజయవంతమై 31వ వారం వరకూ శిశువు అభివృద్ధి, రక్త ప్రసరణ అన్నీ సక్రమంగానే ఉన్నాయి. కానీ అకస్మాత్తుగా తల్లికి విపరీతమైన అధిక రక్త పోటు (ప్రీ-ఎక్లామ్సియా) వచ్చి పరిస్థితి ప్రమాదకరంగా మారింది.

లోపల బిడ్డ గుండె కూడా కాస్త తేడాగా కొట్టుకుంటున్నట్టు గమనించిన వైద్యులు వెంటనే సిజేరియన్ సెక్షన్ చేసి బిడ్డను బయటకి తీసారు. సాధారణంగా మానవులలో గర్భావధి కాలం నలభై వారాలు. కానీ 32 వారాల బిడ్డని బయటకి తీసి పది రోజుల పాటు వైద్య పర్యవేక్షణలో వుంచి తల్లికి అప్పచెప్పారు. పుట్టినపుడు ఆ బిడ్డ బరువు 1.8 కిలోలు. ఆ తల్లిదండ్రుల ఆనందానికి అంతే లేదు. ఇంకొంత కాలం తరువాత మరో బిడ్డకు ఆ గర్భాశయం జీవం ఇస్తుందో లేదో తెలుసుకోవాలి. ఆ సంగతి తరువాత ఆలోచిస్తామంటున్నారు తల్లిదండ్రులు.

అటు వైద్యులు, ఇటు తల్లిదండ్రులు, గర్భాశయం దానం చేసినావిడ సంతోషంగానే వున్నా, యధావిధిగా ఒక వర్గం ఈ ప్రక్రియ పై వ్యతిరేకత వ్యక్తం చేస్తోంది. సజీవ మానవుల అవయవాలను, ముఖ్యంగా గర్భాశయాలను ఇతరులలో అమర్చడాన్ని తప్పు బడుతున్నారు.

ఇటువంటి గర్భాశయ మార్పిడులు ఇంతకు మునుపు సౌదీ అరేబియాలో రెండు సార్లు జరిగాయి. కానీ ఆ సందర్భాలలో విజయవంతంగా పిల్లలు పుట్టలేదు. అలాగే ఈ విజయవంతమైన ఆపరేషన్ చేసిన డాక్టర్ బ్రాన్ స్ట్రామ్ కూడా గత రెండేళ్లలో తొమ్మిది మంది మహిళలలో గర్భాశయాలను అమర్చాడు. వాటిలో రెండింటిని అనివార్యంగా తీసివేయవలసి వచ్చింది. మిగతా ఏడింటిలో పిండాలను ప్రవేశ పెట్టారు. ఇప్పుడు అనేక దేశాలలో ....మరణించిన స్త్రీల నుండి గర్భాశయాలను సేకరించడం పై దృష్టి పెట్టారు.

ఇన్ని కష్టాలు పడి సంతానం పొందటం కంటే దత్తత తీసుకోవడం మేలు అనేవారు వున్నారు. ఒకరకంగా సహజ శరీర ప్రక్రియల వ్యవస్థలో ఇటువంటి వైద్య పరమైన జోక్యాలు (ముఖ్యంగా ప్రాణాంతకం కాని వాటికి కూడా) అవసరమా అనే మీమాంస కొనసాగుతూనే వుంది, వుంటుంది. కానీ మాతృత్వం లోని మాధుర్యానుభవం విశ్లేషణ లకి చర్చలకీ అతీతమైనంత సున్నితమైనది. దానికి తర్కం అనవసరం.

ఇప్పుడు తల్లీ, బిడ్డా ఇద్దరూ ఆరోగ్యంగా వున్నారు. ఆ చిన్నారి (విన్సెంట్) అన్ని విధాలా సాధారణ పిల్లవాడి లాగానే వున్నాడు. కానీ అతను కొన్ని ఏళ్ళ తరువాత ఎప్పుడో, తానో ప్రత్యేకమైన వాడినని, ఈ విధంగా ఒక వైద్య అద్భుతంలో జన్మించిన మొట్టమొదటి వ్యక్తి తనే అని తెలుసుకుని యెంత ఆశ్చర్యపోతాడో!

- డా॥ కాకర్లమూడి విజయ్

◆ సమ్‌థింగ్ స్పెషల్

పిశాచి బొమ్మల పండుగ

తెలుగు నాట ఒక సామెత ఉంది. లాభం లేనిదే వ్యాపారి వరదన పోడు, అంటే వరద వస్తోందని అందరూ సురక్షిత ప్రాంతాలను వెతుక్కుంటూ ఉంటే వరదలో కూడా లోభి అయిన వ్యాపారి లాభాన్ని వెతుకుతాడని అర్థం. విపత్కర స్థితిలో వ్యాపారం చేయకూడదనేది పాతకాలపు నీతి. ఇప్పుడు వ్యాపారులు అలా చేయటాన్ని లోభితనంగా పరిగణించటం లేదు. ఎలా అయితేనే ఎంత సంపాదించాడన్నదే ముఖ్యంగా పరిగణించి డబ్బు గడించిన వారిని ఆకాశానికి ఎత్తటం నేటి నీతి.

అగ్గిపుల్ల, కుక్కపిల్ల, సబ్బుబిళ్ల కాదేదీ కవిత కనర్హం అన్న మహాకవి శ్రీశ్రీ మరికొంత కాలం బతికి ఉంటే వ్యాపారానికి ఏదీ అనర్హం కాదని మరో కొత్తదాన్ని మనకు అందించేవారు. పెట్టుబడిదారీ వ్యవస్థను కూకటి వేళ్లతో పెకలించాలని చూసిన 'చే గువేరా'ను కూడా పెట్టుబడిదారులు తమ వాణిజ్యానికి ఎంతగా వినియోగించుకుంటున్నారో చూస్తున్నాము.చే గువేరా టీషర్టులు ధరించే యువతీ యువకులకు చే గురించి ఆయన సిద్ధాంతాల గురించి ఎంత మందికి తెలుసు. అంటే తమకు లాభసాటిగా ఉన్నంత వరకు కమ్యూనిస్టులను కూడా ఉపయోగించుకుంటారు. అదే చే షర్టులను ధరించే వారంతా పెట్టుబడిదారీ విధాన అసమానతలను ప్రశ్నించేవారుగా మారితే చే బొమ్మలను కనపడకుండా చేస్తారు.

ప్రతిదాన్నీ లాభం దృష్టితో చూసే అమెరికన్లను చూసి వారి పూర్వీకులలో ఒకరైన జర్మన్లు ముక్కుమీద వేలు వేసుకుంటున్నారు. అమెరికా, ఐరోపాలో క్రిస్మస్ ఎంత పెద్ద పండగో తెలిసిందే. మన దగ్గర దసరా, దీపావళి, సంక్రాంతి సందర్భంగా వ్యాపారులు తమ సరకులను ఖాళీ చేసేందుకు ఎంత కసరత్తు చేస్తారో అంతకంటే ఎక్కువ హంగామా ఉంటుంది. డిసెంబరు చివరి వారంలో వచ్చే క్రిస్మస్‌కు ఈ ఏడాది సెప్టెంబరు నుంచే దుకాణాల్లో క్రిస్మస్ గీతాలు, శాంతాక్లాస్‌లు, చాక్లెట్లు, కుకీల సందడి ప్రారంభం కావటాన్ని సామాన్య జర్మన్లు జీర్ణించుకోలేకపోతున్నారట.

క్రైస్తవుల నమ్మకం ప్రకారం క్రిస్మస్ సంబరాలు లేదా క్రీస్తు రాకకోసం ఎదురు చూడటం అనేది నవంబరు 27 డిసెంబరు మూడవ తేదీ మధ్య వచ్చే ఆదివారంతో ప్రారంభం అవుతుంది. ఆ ఆదివారం నుంచి క్రిస్మస్ కొనుగోళ్లు, ఏర్పాట్లకు శ్రీకారం చుడతారు. అలాంటిది సెప్టెంబరులోనే అమ్మకాలేమిటి? అవి క్రిస్మస్ సందర్భం ఎలా అవుతాయన్నది జర్మన్ల అభ్యంతరం. అమెరికా తరహా వాణిజ్య ధోరణులు పాత ఐరోపాను ముంచేస్తున్నాయని, క్రిస్మస్‌కు అర్థం లేకుండా పోతున్నందున ముందుగా క్రిస్మస్ వస్తువులను అమ్మకుండా దుకాణాలపై చర్యలు తీసుకోవాలని మూడింట ఒక వంతు మంది జర్మన్లు కోరుతున్నట్లు తాజా సర్వేలో వెల్లడైంది.

ప్రపంచంలో అనేక దేశాలలో ఆదివారాలు షాపింగ్ చేయటం ఒక హాబీగా మారిపోయింది. జర్మనీ రాజ్యాంగం ప్రకారం ఆదివారం అంటే విశ్రాంతి దినం.ఆరోజున కూడా దుకాణాలను తెరవటం జర్మనీలో కూడా ప్రారంభమైంది. కొన్ని రాష్ట్రాలలో ఆదివారం దుకాణాలు తెరవటంపై నిషేధం విధించారు. ప్రత్యేక అనుమతులతో తెరవవచ్చు. క్రిస్మస్ మాసంలో ప్రతి ఆదివారం స్నేహితులు, బంధువులను తమ ఇళ్లకు కాఫీకి ఆహ్వానించటం కొన్ని చోట్ల ఒక సాంప్రదాయం.

క్రిస్మస్ మాసంలో వచ్చే నాలుగు ఆదివారాలలో దుకాణాలు తెరవటంపై జర్మన్ కార్మికులు, చర్చి అధికారులు సుప్రీం కోర్టుకు ఫిర్యాదు చేసి విజయం సాధించారు. అయినప్పటికీ సెప్టెంబరులోనే క్రిస్మస్ వాతావరణం ఏర్పడటంతో కలికాలం అన్నట్లుగా జర్మన్లు మండిపడుతున్నారు.

క్రిస్మస్‌తో సహా ప్రతి సందర్భం వాణిజ్యమయం కావటం ఐరోపాలో నానాటికీ పెరిగిపోతోంది. క్రిస్మస్ సందర్భంగా క్రిస్మస్ తాత పిల్లలకు బహుమతులు తెస్తాడని అందరికీ తెలుసు. కానీ ఐరోపాలోని కొన్ని దేశాలలో సెయింట్ నికోలస్ డే(డిసెంబరు ఆరవ తేదీ)కు ముందు రోజు సాయంత్రం దారితప్పిన పిల్లలను భయపెట్టేందుకు 'క్రాంపస్' అనేక ఒక భయకర పిశాచి వీధుల్లోకి వస్తుందనే నమ్మకం ఉంది. దాన్ని ఆధారం చేసుకొని అనేక దేశాలలో క్రిస్మత్ తాతతో పోటీబడుతూ డిసెంబరు ఐదున భయంకర పిశాచి బొమ్మల వ్యాపారం పెద్ద ఎత్తున చేస్తున్నారు. ఆరోజున బంధనాల గొలుసులు, పిశాచి ధ్వనుల బూరలు... తదితర వస్తువులను విపరీతంగా మార్కెట్‌లో కుమ్మరిస్తున్నారు. శతాబ్దాల నాటి జానపద కథను సైతం వాణిజ్యమయం చేసేశారు. చివరికి పిశాచి గ్రీటింగ్ కార్డులు, చాక్లెట్లు, అలంకరణలు కూడా మార్కెట్‌లోకి వచ్చేశాయి. మరుసటి రోజు సెంట్ నికోలస్ డే సందర్భంగా పిల్లలకు చాక్లెట్లు, కుకీలు పంచటం కూడా వాణిజ్యమయమైంది. ఆస్ట్రియా వంటి చోట్ల క్రాంపస్ రన్‌లు, పరేడ్‌లు కూడా ప్రారంభమయ్యాయి. వాటిలో పాల్గొనేవారంతా పిశాచి దుస్తులు, వేషాలను ధరించాల్సి ఉంటుంది. అనేక దేశాలలో ఇపుడు పిశాచి బొమ్మలను ఎంత భయంకరంగా తయారు చేస్తే అంతగా అమ్ముడుపోతున్నాయట. తప్పుదారి పట్టిన పిల్లలను దారిలోకి తెచ్చే పిశాచి ఇలాంటి వాణిజ్యీకరణ తప్పు చేసేవారిని దండించవద్దా?

- సత్య

◆ సందర్భం

చెప్పడానికేం బాగానే చెబుతారు. అందరికీ సంతోషంగా వుండాలనే ఉంటుంది. కలిగినోళ్లకు, సంసారం లేనివారికి చెబితే సరిపోతుందేమోగాని సామాన్యులకు కాదు కదా! జీవితంలో ఎన్ని సమస్యలు - అప్పులు, జబ్బులు, చావులు, నిరుద్యోగ సమస్య, మగని బాధలు, పెళ్లాం కోర్కెలు ఇలా ఎన్నో. వీటి మధ్య ఎలా సంతోషంగా ఉండటం? ఇలాంటిదాన్నేమో మెట్ట వేదాంతం అంటారు. ఇది చెప్పటానికి బాగుంటుంది కాని జీవితంలో సాధ్యపడేది కాదు. అయినా జీవితంలో ఎంతమంది సంతోషంగా ఉన్నారు? రోజురోజుకీ నరకప్రాయమవుతున్న జీవితంలో సంతోషాన్ని ఎలా వెతకటం? ఈరోజు సంతోషాన్నిచ్చేది మరోరోజు సమస్యల వలయమవుతుంది. మరి వీటిలోంచి సంతోషాన్ని ఎలా పొందటం?

సంతోషంగా ఉండండి



కానీ ప్రతి వ్యక్తి జీవితం అమూల్యమైంది. అద్భుతమైంది. కోటి ప్రభల్తో నిండిన సూర్యోదయం, జగత్తును వెన్నెల్తో నింపుతూ చంద్రోదయం, చల్లని గాలి, ప్రాణుల దప్పిక తీరుస్తూ నదీజలాలు, సెలయేర్లు, హెూరెత్తుతున్న సాగరాలు, ఆ సాగరాల్లోంచి పైకెగిరే మేఘాలు, వర్షం, మనుషుల్తో పాటే జీవిస్తున్న అనేక జీవరాశులు నిండిన ప్రపంచం ఇది. పచ్చిక బయళ్లు, రంగురంగుల పువ్వులు, ఈ సృష్టిలో ఎన్ని రంగులో, ఎన్ని వాసనలో? ఇంతటి గొప్ప ప్రపంచంలో జీవించటం అదృష్టం. ఈ అందాల్ని చూడలేకపోవటం దురదృష్టం. నీ కష్టాల్లోంచి ప్రపంచాన్ని చూసినా నీ కష్టాలు ఆ క్షణాన పోకపోయినా నీకు సంతోషం మాత్రం కలుగుతుంది. సంతోషం బలాన్నిస్తుంది. అలా లభించిన బలంతో మీరు ఏ కష్టాన్నైనా ఎదురించగలరు. తాత్కాలిక కష్టాల మాయలో పడి మనమెంతో పోగొట్టుకుంటున్నాము.

పేదరికంలో సుఖసంతోషాలుండవని చాలామంది అనుకోవచ్చు. 1962లో నేను నా నలుగురు చెల్లెళ్లను తీసుకొని కడపలో వకీలుగా ప్రాక్టీసు చేయడానికి వచ్చినాను. మా వెంట కేవలం ఒక మూట జొన్నలు, అరమూట కొర్రలు, 10శేర్ల కందిబేడలు తీసుకొని వచ్చినాము. పాత కోర్టుకు ఎదురుగా ఒక ఇంటిపై భాగాన్ని అద్దెకు తీసుకున్నాను. ఒకపెద్ద రూము, ఒక వరండా మాత్రమే ఉంది. వంట, తినడం, పడుకోవడం అంతా అదే గదిలోనే. రాత్రిపూట రొట్టెలు, పప్పు తప్ప ఇంకేమీ వుండదు. కానీ మేమెంత హాయిగా, సంతోషంతో జీవితం గడిపామో చెప్పలేను. ఒక్కోసారి అలా వెనక్కుపోయి కొన్ని రోజులైనా అలా గడిపితే ఎంత బాగుండునోనని అన్పిస్తుంది. ఆనందం, మేమున్న చిన్న ఇంటిలో, వరి అన్నం లేని మా భోజనంలో, బట్టల్లో లేదని నేను తెలుసుకున్నాను. అసలైన ఆనందం మా ఆలోచనల్లో వుంది. తృప్తిగా జీవించాలనే మా బలీయమైన కోర్కెలో ఉంది.

మన జీవితాల్లో సంతోషాన్ని, శాంతిని హరించేవి మనకందని దురాశలు. అవి లభించవని తెలిసి కూడా వాటిని కోరుకుంటాము. మంచి వస్తువుల్ని కోరుకోవటంలో తప్పులేదు. కాని అవి అందకపోతే క్రుంగిపోనవసరం లేదు. కలల్ని కనటం ఒక ఆనందం – అవి పొందకపోయినా కలలు కనటం మంచిదే. కలలు పండని రోజున వున్నదానిని అపురూపంగా చూసుకొని సంతోషించవచ్చు. సంతోషం ఎంతో విలువైంది. దానిని మన ఆర్థిక పరిస్థితులకు ముడిపెట్టి ఆ సంతోషాన్ని పోగొట్టుకోకూడదు. ఓటమి, పేదరికం నీ జీవిత గమనానికి శాశ్వత అవరోధాలు కావు. ఈ రెండింటిని మనిషి అనేక పద్ధతుల్తో ఎదుర్కోవచ్చు. ఈరోజు జీవితంలో పైకి వచ్చినవాళ్లలో నూటికి 90 శాతం పేదరికంలోంచి వచ్చిన వాళ్లే. పేదరికానికి తలవంచకూడదని వారలా ముందుకుసాగారు. ఓటమి గెలుపునకు సోపానమని మీరు వినే ఉంటారు. ఓటమితో పోరాడటంలో ఒక గర్వం ఉంది. ఒక నిశ్చయం ఉంది. బంగారంలాంటి జీవితాల్ని తాత్కాలిక సమస్యలకు భయపడి నాశనం చేసుకోకూడదు.

జీవితాన్ని ఆనందంగా గడపటం మన ధర్మం. మనతోబాటు మన చుట్టూ ఉన్న మనపై ఆధారపడే ప్రాణులకు కూడా మనం శాంతి, సంతోషాన్ని ఇవ్వటం ధర్మం. ఎందుకంటే వారు మన కుటుంబం. మనపైన ఆధారపడిన కుటుంబం. వారి ఆనందానికి కృషి చేయటంలో గొప్ప ఆనందమూ, సంతోషమూ ఉంటుంది. జీవితంలో చాలా ఉత్కృష్టమైన పోరాటం, సుఖసంతోషాల కోసం చేసే పోరాటమే. ఈ పోరాటంలో ఒక తృప్తి ఉంది. ఆనందం ఉంది. ఇది ఒక సమాజపు రూపు రేఖల్ని కూడా మార్చుతుంది. కుటుంబం సుఖసంతోషాలు సంపదపై, వారి ఆర్థిక స్థోమతపై ఆధారపడి ఉండవు. అలాగైతే డబ్బున్న వాళ్లంతా సుఖపడుతూ ఉండాలి. అదేవిధంగా ధనికులు కానివారు నిరాశ, నిస్పృహల్తో మగ్గిపోతూ ఉండాలి. కాని వాస్తవానికి ఇది నిజం కాదు. సంపదకు, మానసిక శాంతికి, సంతోషానికి సంబంధమే లేదు. సంపద సుఖాల్ని ఇవ్వవచ్చు. కాని శాంతి కాదు. ఆనందం కాదు. శాంతి, ఆనందం మానసిక పరిపక్వత నుండి ఉద్భవిస్తాయి. పరిపక్వత అనుభవం ద్వారా, ఒక దృఢ సంకల్పం ద్వారా లభిస్తుంది. పై రెండింటికి డబ్బుకూ సంబంధమే లేదు. నీవు సంతోషంగా ఉండాలనుకుంటే ఉండవచ్చు. నీ పిల్లల్తో ఎంత తరుచుగా మాట్లాడితే అంత ఆనందం పిల్లల మనస్సుల్లోను, మీ మనసులోనూ ఉంటుంది. భార్యతో మరికొంత చనువుగా, ప్రేమగా ఉండటం ఇరువురికీ సంతోషకరమైందే. ఈ అలవాట్లేమీ ఖరీదైనవి కాదు. కష్టమైనవీ కాదు. ఒక మంచి మాట, ఒక చిరునవ్వు, ఒక స్పర్శ, ఒక మెప్పుకోలు, ఒక ఆలింగనం, వీటన్నింటికీ చిల్లిగవ్వ ఖర్చు కాదు. కాని మనలో ఎంతమంది ఈ పనులు చేయగలగుతున్నాము. కాని అలా చేస్తే జీవితంలో ఎంత సంతోషం, ఆనందం నిండిపోతాయో ఊహించుకోండి. జీవితంలో శాంతి, ఆనందం నీవు ఓర్పుగా అలవర్చుకుంటే వస్తాయి. నీ జవిత విధానంలో కొద్ది మార్పులు తెచ్చుకుంటే వస్తాయి. నీ మంచి జీవితం కోసం ఆ మాత్రం శ్రమ తీసుకోవటం అవసరం. ఈరోజు నుండి ఆ ప్రయత్నం మీరు ఎందుకు మొదలు పెట్టకూడదు? ఇంటికి వస్తూనే పిల్లల్ని దగ్గరకు తీసుకోండి. వారికి కబుర్లు చెప్పండి. మీ భార్యతో ఆరోజు వంట గురించో మరే ఇతర సమస్యల గురించో మాట్లాడండి. ఆమె వంటనో, మాటనో, ఆరోజు ఆమె చేసిన ఏ మంచి పనినైనా అభినందించండి. కలిసి భోంచెయ్యండి. నిజానికి ఈ దృష్టితో ఆలోచించటం మొదలు పెడితే ఎన్నెన్నో చేయవచ్చు. నీ కుటుంబ సభ్యుల్లో అభినందించవల్సినవెన్నెన్నో చూడవచ్చు.

తప్పులు మనమూ చేస్తాం. బాల్యాన్ని మనమూ గడిపాం. భార్యా – బిడ్డలు ఏదైనా పొరబాటు చేస్తే క్షమించే గుణం అలవర్చుకోవాలి. ప్రేమతో వాటిని సరిదిద్దాలి. సుఖంగా, సంతోసంగా ఉండటం ఒక తపస్సులాంటిది. దానిని కష్టపడి సాధన చేయాలి. దానికోసం చిన్న చిన్న త్యాగాలు అవసరమైతే చేయాలి. ఈ ప్రయత్నమే నీ జీవితాన్ని పరిపూర్ణం చేస్తుంది. జీవితంలో ఆనందాన్ని, శాంతిని నింపుతుంది.

- సి.సి.రెడ్డి

నవ్వుల్ – పువ్వుల్

ఎన్ని



తండ్రి : ఏరా నాని... ఈరోజు లెక్కల పేపర్లో ఎన్ని ప్రశ్నలిచ్చారు?

కొడుకు : ఏభై మార్కులకు ఐదు ప్రశ్నలిచ్చారు డాడీ. చాలా కష్టంగా ఉన్నాయి.

తండ్రి : నువ్వెన్ని రాశావు?

కొడుకు : మొదటి రెండు, చివరి మూడు తప్ప అన్నీ రాశాను డాడీ.

....

ఉతుకుడు



రాజు : నా మీద కోపం వస్తే మా ఆవిడ ఉతికేస్తుంది

లింగు : అదెలా...?' (అడిగాడు ఆసక్తిగా)

రాజు : మరేదో ఊహించుకోమాకురోయ్! బట్టలు విప్పాక వాటిని ఉతకడంలో చూపిస్తుంది కోపం.

....

సస్పెండ్



చక్రి : మా తమ్ముడు జలాంతర్గామిలో పనిచేసేవాడు. వాణ్ణి ఉద్యోగంలోంచి సస్పెండ్ చేశారు...!

సుధీర్ : దేనికి?

చక్రి: వాడిది వేడి శరీరం. గాలి కావల్సినప్పుడల్లా కిటికీలు తెరవడం వాడి అలవాటు అందుకే...! సస్పెండ్ చేశారు.

....

చదివి తింటే...

(నిరక్షరాస్యుడైన రామస్వామి తన తోటి వారి వద్దకు వెళ్లి ఇలా అంటున్నాడు.)

రామస్వామి : ఒరేయ్ మనమందరమూ అర్జెంటుగా చదువు నేర్చుకోవాలిరా

మిత్రులు : ఎందుకురా?

రామస్వామి : మీకు తెలీదా? మనం తినే ప్రతి మెతుకుపైనా మన పేరు ఉంటుందట. తినే ముందు దానిని చదివి తింటే మేలు కదా అని.

....

చాక్లెట్లు

శ్రీను : ఒరేయ్! బన్నీ...! ఇదిగో ఈ చాక్లెట్లు తీసుకుని... మీ అక్కకు ఈ లవ్ లెటర్ ఇవ్వు?

బన్నీ: అబ్బే అన్ని చాక్లెట్లు వద్దండి... కొన్ని చాలు..

శ్రీను : ఏం? ఎందుకని?

బన్నీ : ఉదయమే మా అన్నయ్య మీ చెల్లెలికి లవ్‌లెటర్ ఇవ్వమంటే ఇచ్చాను! దానికి దీనికి చెల్లు.



కాలర్ ట్యూన్



జానకి : నీకు సెల్ ఎందుకే ఉండేది... అస్తమానం స్విచాఫ్ చేసి పెట్టుకోవడానికా...

సీత : నా సెల్లా... దానికేమయింది... నిక్షేపంగా పనిచేస్తోంది...

జానకి : పనిచేస్తోందా... మరి ఎన్నిసార్లు కాల్ చేసినా స్విచాఫ్ అని చెబుతోంది.

సీత : ఆహా... అది నా ఫోన్ కాలర్ ట్యూన్..

....

ఒక్క నిమిషం

అప్పారావు : బాగా తాగి బస్ ఎంక్వైరీ రూమ్ దగ్గరికి వెళ్లాడు.

అప్పారావు : మేడమ్, హైదరాబాద్ నుంచి శ్రీకాకుళం వెళ్లడానికి ఎంత టైం పడుతుందో చెబుతారా...?

అధికారి : ఒక్క నిమిషం సార్... (టైమింగ్ డైరీ తీసి చూస్తుండగానే)

అప్పారావు : థ్యాంక్యూ మేడమ్.. అంటూ వెళ్లిపోయాడు.

....

అనుకున్నా

(హాస్పిటల్ బెడ్ పైన ఉన్న సుబ్బారావుతో రాంబాబు సంభాషణ)

రాంబాబు : 'అంత బాగా బైక్ నడిపేవాడివి, అలాంటిది కారునెలా గుద్దేశావురా..?'

సుబ్బారావు : చీకట్లో దూరం నుంచి చూస్తే రెండు బైకుల్లా కనిపించాయిరా..! వాటి మధ్య నుంచి వెళ్లి సర్‌ప్రైజ్ చేద్దామనుకున్నా. ముందుకెళ్తేగానీ తెలీలేదు అది కారని!

....

ప్రతి సంవత్సరం



టీచర్ : నీ పుట్టిన రోజు ఎప్పుడు చంటీ...?

చంటి : ఆగస్టు15న టీచర్

టీచర్ : ఏ సంవత్సరంరా?

చంటి : ప్రతి సంవత్సరమూ టీచర్!!

ప్రేమ... విప్లవం...

మార్క్స్, జెన్నీ ప్రేమ కథ

"విజయోత్సాహంతో ట్రీయర్‌కు తిరిగి వచ్చాడు మార్క్స్. అయితే, కొలోన్‌లో లాగ, ఇక్కడెవరూ ఆయన్ను పొగడ్తలతో ముంచెత్తలేదు. అద్భుత మేధో పటిమకు జోహారనలేదు. అసలు, స్నేహపూర్వక వాతావరణమే లేదు. ఇంటికి చేరగానే తల్లితో గొడవపడ్డాడు. తననెవరూ పట్టించుకోవటం లేదనీ, వెస్ట్‌ఫాలెన్‌లు కూడా అంటీముట్టనట్టగా, దూరందూరంగా వుంటున్నారని ఫిర్యాదు చేసిందామె. ఈ గొడవ చినికి చినికి గాలివానగా మారి, చివరకి అక్కడ వున్నన్నాళ్లూ తన సోదరి పెళ్లి తంతు ముగిసిందాకా ఒక గెస్ట్‌హౌస్‌లో గది తీసుకొని వున్నాడు మార్క్స్. తల్లి ఎంత గోలపెట్టినా ఆ కన్నీళ్లేవీ తనను కదిలించలేదు. మనసంతా కొలోన్‌లోని పరిణామాల మీదే లగ్నమై ఉంది."

మూలం : మేరీ గేబ్రియెల్ 'లవ్ అండ్ కేపిటల్'

స్వేచ్ఛానువాదం: ముక్తవరం పార్థసారథి

కొన్నాళ్ల నుండీ జబ్బుగా వున్న లుడ్విగ్ వాన్ వెస్ట్‌ఫాలెన్ పరిస్థితి డిసెంబర్ 1841 నాటికి క్షీణించింది. ట్రీయర్‌కు తిరిగి వచ్చిన మార్క్స్, పెద్దాయనకు సాయంగా వుండటానికి వెస్ట్‌ఫాలెన్ ఇంటికి చేరుకున్నాడు. జెన్నీకి దగ్గరగా వుండవచ్చుననేది మరో ముఖ్య కారణం. మార్క్స్ అక్కడ ఉండగానే ప్రష్యన్ కేబినెట్ మంత్రులు రెచ్చగొట్టే పద్ధతిలో ఒక సెన్సార్‌షిప్ డిక్రీ విడుదల చేశారు. పైకి ఇది రచయితలకు అనుకూలంగానే ఉన్నట్టు కనిపించినా, 1819 నాటి ఆంక్షలను పునరుద్ధరించింది. ఈ కొత్త చట్టం ప్రకారం మత విశ్వాసాలకు వ్యతిరేకంగా, లేదా మతాన్ని, రాజకీయాలనూ కలిపి విమర్శిస్తూ, లేదా వ్యక్తి లేదా గ్రూపులను అపకీర్తిపాలు చేసేదిగా, లేదా మరేదైనా అర్థంలో రెచ్చగొట్టేదిగా ప్రభుత్వం భావించినట్టయితే దాన్ని సెన్సారు చేయటం జరుగుతుంది. అంటే వెరసి అచ్చయిన ప్రతి పదాన్నీ సెన్సారు చెయ్యగలిగే అధికారం సంక్రమిస్తుంది.

వెస్ట్‌ఫాలెన్‌ల ఇంట్లో వున్న కాలంలోనే మార్క్స్ ఈ డిక్రీకి తన ప్రతిస్పందనను సిద్ధం చేసుకున్నాడు. ఫలితంగా, సెన్సార్‌షిప్ చట్టం మీద ఎదురుదాడి ప్రారంభమైంది. మతం ముసుగులో, తాత్వికత ముసుగులో తన రాజకీయాలను దాచే ప్రయత్నం చేయలేదు. నిరసనను సహించని ప్రభుత్వం మీద యుద్ధ ప్రకటన లాంటి వ్యాసంతో తన జర్నలిజం ప్రారంభించాడు మార్క్స్. ఇరవై రెండు పేజీలలో లావా లాగ ప్రవహించింది ఆగ్రహం.

'ఆలోచనలను అణచివేయటానికి చేసిన చట్టం, ప్రజల ప్రయోజనాల కోసం చేసింది ఎంతమాత్రమూ కాదు. ఇది ఒక రాజకీయ పక్షం, తన ప్రత్యర్థి రాజకీయ పక్షానికి వ్యతిరేకంగా చేసిన చట్టం. ఇది ప్రజల్ని విభజిస్తుంది. సమైక్యంగా ఉంచదు. ప్రజల్ని విభజించే చట్టాలన్నీ రియాక్షనరీ చర్యలే. అసలది చట్టం కాదు. ప్రభుత్వం తన అధికారాన్ని దుర్వినియోగం చేయటం మాత్రమే. సెన్సార్‌షిప్ దుష్పరిణామాలను నివారించే పద్ధతి ఒక్కటే. అదే, సెన్సార్‌షిప్‌ను పూర్తిగా ఎత్తివేయటం.

'ఒక రైన్‌లాండ్ నివాసి' పేరున సంతకం చేసిన ఈ వ్యాసాన్ని డ్రెస్డెన్‌లో 'జర్మన్ ఇయర్ బుక్' పత్రికను నిర్వహిస్తున్న ఆర్నాల్డ్ రూగ్‌కు పంపాడు మార్క్స్. మనసులో, మార్క్స్‌కన్నా పదహారేళ్లు పెద్దవాడు రూగ్. ఉదారవాది (లిబరల్) అయిన రూగ్, అతని అభిప్రాయం కారణంగా అప్పటికే ఆరేళ్లు జైల్లో గడిపాడు. ఈ కారణంగానే యూనివర్సిటీలో ప్రమోషన్ కూడా రాలేదు. తన వార్తాపత్రికను ప్రష్యాలో ప్రారంభించినా, అక్కడ దాన్ని నిషేధించటంతో మరోచోటికి తరలించక తప్పలేదు. డ్రెస్డెన్‌లో నిబంధనలు అంత కఠినంగా లేకపోవచ్చు గాని, అక్కడ కూడా అది సెన్సారు అణచివేతకు గురైంది. 1838లో ఒక ముఖ్యమైన ప్రభుత్వోద్యోగం చేస్తున్న ఫెర్డినాండ్ దృష్టి నుండి కూడా ఇది తప్పించుకోలేదు. మార్క్స్ ఇది తన తండ్రి ఇంట్లో ఉన్నప్పుడే రాశాడనేది స్పష్టం.

మార్క్స్ తన వ్యాసాన్ని రూగ్‌కు పంపిన నెల తర్వాత లుడ్విగ్ మరణించాడు. ఆ ఇంట్లో, మార్క్స్ అభిప్రాయాలను గౌరవించిన, సమర్థించిన ఒకే ఒక్క వ్యక్తి అతను. ఇప్పుడు ఇంటి యజమానిగా మారిన ఫెర్డినాండ్.... జెన్నీ, మార్క్స్‌ల ఎంగేజ్‌మెంట్‌ను రద్దు చేయటానికి తీవ్రంగా కృషి చేశాడు. ఈ ప్రయత్నంలో జెన్నీ అంకుల్ ఒకాయన (సాంప్రదాయక భావాలు గల పెద్ద మనిషి) హైన్రిష్ జార్జ్ వెస్ట్‌ఫాలెన్ కూడా ఆయనతో జతగట్టాడు. జెన్నీ తల్లి కారొలైన్‌కు, కూతురికీ, కార్ల్‌కూ ఏర్పడిన సంబంధం గురించి తెలుసో లేదో గాని, ఆమె జెన్నీని ఫెర్డినాండ్ నుండి దూరంగా క్రూజ్‌నాచ్‌లో వున్న తన ఇంటికి తీసుకునిపోయింది. (ట్రీయర్ నుండి

యాభై మైళ్ల దూరంలో వుంది (క్రూజ్‌నాచ్) అక్కడే, ఇద్దరు మహిళలూ తుఫాను సమిసిందాకా తలదాచుకున్నారు.

ట్రీయర్‌ను వదిలి కొలోన్ చేరుకున్నాడు మార్క్స్. అక్కడ, ప్రష్యన్ ప్రతిపక్షంగా ప్రకటించుకున్న వాణిజ్యవేత్తల క్లబ్బులో సభ్యత్వం తీసుకున్నాడు. మార్క్స్ మిత్రుడు జార్జ్ యంగ్, మరో మిత్రుడు మోజెస్‌హెస్‌లు కలిసి, కొందరు వ్యాపారస్తుల్ని 'రీన్‌లాండ్ గజెట్' పేరుతో ఒకపత్రికకు ఆర్థిక సాయం చెయ్యటానికి ఒప్పించారు. పత్రిక ఆశయం 'రాజకీయాలు, వాణిజ్యం, పారిశ్రామిక అవసరాల కోసం'. దీని అర్థం 'మధ్య తరగతి ప్రయోజనాలు'.

ఈ పత్రికకు నిర్వహణలో యంగ్ హెగెలియన్లతోపాటు సోషలిస్టులు, జాతీయవాదులు, ప్రజాస్వామ్యవాదులు, రకరకాల తీవ్రవాద మేధావులు పాలు పంచుకున్నారు. ఉదారవాద లాయర్లు, డాక్టర్లు, పారిశ్రామికవేత్తలు వెన్నుదన్నుగా ఉన్నారు. భవిష్యత్ ప్రష్యన్ ప్రైమ్ మినిస్టర్ ఆర్థిక మంత్రులు కూడా వీళ్ల పక్షం వహించారు.

ఈ నేపథ్యంలో, మార్క్స్, కొలోన్ చేరుకున్ననాటికి ఆయన వయసు ఇరవై మూడు. అప్పటికి ఒక వ్యాసం ప్రచురితమైంది. మరో ఏడాదిలో ప్రష్యాలోని అత్యంత ప్రభావవంతమైన ప్రతిపక్ష వార్తాపత్రికకు సంపాదకుడు కాబోతున్నాడు.

400 మంది చందాదారులతో జనవరి 1, 1842నాడు ప్రారంభమైంది రైనిష్ జైటుంగ్' (రైన్‌లాండ్ గెజెట్). నాలుగు నెలల తర్వాత ఈ పత్రికకు రాయటం ప్రారంభించాడు మార్క్స్. తన తొలి వ్యాసంలోనే పత్రికా స్వేచ్ఛ గురించి ప్రస్తావించాడు. అప్పటికి రైన్‌లాండ్ పార్లమెంట్‌లో దీని గురించి చర్చ జరుగుతున్నది. ఇది వివాదాస్పదమైన విషయం మాత్రమే కాదు. ప్రాదేశిక చట్టసభల్లో జరిగే చర్చల గురించి రాయటం మీద అప్పటికే నిషేధం ఉన్నది.

అయినప్పటికీ, అన్ని అడ్డంకుల్నీ తప్పించుకుని మార్క్స్ ఆర్టికల్, సెన్సార్లను దాటింది. సంబంధిత అధికార్లకు, మార్క్స్ చేసిన సంక్షిప్త వాదన అర్థం కాలేదు. అందులోని హాస్య చతురత, సాహిత్య విలువలు అందర్నీ అలరిస్తాయి. ఆయన వాదనకు ప్రాతిపదిక చాలా స్పష్టం. మనిషి మనుగడకు మూలం స్వేచ్ఛ. ఆ స్వేచ్ఛను కాపాడటానికే వుండాలి చట్టాలు.

'స్వేచ్ఛనెవరూ వద్దనరు. కాకపోతే కొందరు కొన్నిసార్లు పక్కవాళ్ల స్వేచ్ఛను అడ్డు తగుల్తారు. అంటే స్వేచ్ఛ ఏదో ఒక రూపంలో ఎప్పుడో వుంది. ఒకప్పుడు కొందరికి మాత్రమే. కొన్నిసార్లు సార్వత్రిక హక్కుగా.

స్వేచ్ఛను కట్టడి చెయ్యటానికి చట్టాలు ఉండవు. గురుత్వాకర్షణ సిద్ధాంతం చలనానికి వ్యతిరేకం

" మొదటి సంవత్సరంలోనే నాలుగు వందల నుండి మూడు వేల అయిదు వందలకు పెరిగాయి చందాలు. ఎంత ఘాటుగా రాసినా సెన్సార్ల చేతుల నుండి జారిపోతూనే ఉన్నాయి వ్యాసాలు. అయితే, పత్రికకు రాసేవాళ్లతో మార్క్స్‌కు చికాకు తప్పలేదు. వాళ్లు సైద్ధాంతికంగా రాస్తారు. లేదా అభిప్రాయాలు ప్రచారం చేస్తామంటారు. కేవలం వాస్తవ విషయాలు మాత్రమే రాయాలంటాడు మార్క్స్. "

కాదు! వ్యక్తుల ఇష్టాఇష్టాలను బట్టికాక, అందరికీ స్వేచ్ఛ ఉండేలా చూడటానికే చట్టాలుండాలి. రూల్స్ పుస్తకం అనేది స్వేచ్ఛకు బైబిల్ లాంటిది.

అందువల్ల ప్రెస్ లా వున్నదంటేనే "ప్రెస్సుకున్న స్వేచ్ఛను గుర్తించటం".

ఇదే మార్క్స్ తొట్టతొలి ప్రచురిత రచన. ఆయన ఇరవై నాల్గవ పుట్టినరోజునాడు మే 5, 1842 నాడు వెలుగు చూసింది. అయితే, ఆయన పేరుతో అచ్చు కాలేదిది. మిత్రబృందమంతా పొగడ్తలతో ముంచెత్తింది. పత్రిక ఉప సంపాదకుడు, మోజెస్‌హెస్, మార్క్స్ 'ఈ తరంలోని ఒకే ఒక నిజమైన తత్వవేత్త. గ్రేటెస్ట్' అంటూ ఆకాశానికెత్తాడు. సెన్సార్‌షిప్ మీద ఇప్పటివరకూ వచ్చిన బెస్ట్ ఆర్టికల్ ఇదే' అన్నాడు ఆర్నాల్డ్ రూగ్. 'సూపర్బ్' అన్నాడు యంగ్.

విజయోత్సాహంతో ట్రీయర్‌కు తిరిగి వచ్చాడు మార్క్స్. అయితే, కొలోన్‌లో లాగ, ఇక్కడెవరూ ఆయన్ను పొగడ్తలతో ముంచెత్తలేదు. అద్భుత మేధో పటిమకు జోహారనలేదు. అసలు, స్నేహపూర్వక వాతావరణమే లేదు. ఇంటికి చేరగానే తల్లితో గొడవపడ్డాడు. తననెవరూ పట్టించుకోవటం లేదనీ, వెస్ట్‌ఫాలెన్‌లు కూడా అంటీముట్టనట్టుగా, దూరందూరంగా వుంటున్నారని ఫిర్యాదు చేసిందామె. ఈ గొడవ చినికి చినికి గాలివానగా మారి, చివరికి అక్కడ వున్నన్నాళ్లూ తన సోదరి పెళ్లి తంతు ముగిసిందాకా ఒక గెస్ట్‌హౌస్‌లో గది తీసుకొని వున్నాడు మార్క్స్. తల్లి ఎంత గోలపెట్టినా ఆ కన్నీళ్లేవీ తనను కదిలించలేదు. మనసంతా కొలోన్‌లోని పరిణామాల మీదే లగ్నమై ఉంది.

రైనిష్ జైటుంగ్'కు ఆదరణ పెరిగింది. దానితో పాటే సంపాదకవర్గానికి చిక్కులూ పెరిగాయి. ఎడిటర్లు తరచుగా మారారు. 1842 వేసవిలో, మార్క్స్ మిత్రుడు అడాల్ఫ్ రూటెన్‌బర్గ్‌ను కొత్త ముఖ్య సంపాదకుడిగా నియమించారు గాని, తాగుడుకు అలవాటు పడిన అతడు ఆ హోదాలో ఎక్కువకాలం కొనసాగే అవకాశం లేదు. పైగా సెన్సార్లు వాళ్లు కూడా అతడి మీద గుర్రుగా ఉన్నారు.

అప్పటికి అనేక కీలక విషయాల గురించి, ఆణిముత్యాల్లాంటి ఆర్టికల్స్ అనేకం అందులో ప్రచురించాడు మార్క్స్ – అన్నీ వివాదాస్పదమైనవే అయినా, తన ప్రతిభతో అంతరార్థం ప్రభుత్వ దృష్టికి రాకుండా జాగ్రత్తపడ్డాడు. పత్రిక రాడికల్స్ చేతుల్లోకి పోతున్నదని బాధపడ్డ పెట్టుబడిదారులకు అలా జరగదని భరోసా ఇచ్చాడు. సైద్ధాంతిక చర్చలు కాదు. వాస్తవ సమస్యల్ని చర్చించాలి పత్రిక. రాసేవాళ్లకు దారి చూపాలి. అంతేకాని, వాళ్లు చూపిన దిశలో అది ప్రయాణించకూడదు.

అయితే, పత్రికకు కేవలం కరస్పాండెంట్‌గా ఉండదలుచుకోలేదు మార్క్స్. పెట్టుబడిదార్లకు ఆయన అభిప్రాయాలు నచ్చి, అక్టోబర్ 15నాడు ఎడిటర్ ఇన్ చీఫ్‌గా నియమించారు. ఆ తర్వాత మొదటి రోజునే రైనిష్ జైటుంగ్' కమ్యూనిజాన్ని ప్రచారం చేస్తుందన్న ప్రత్యర్థి పత్రిక అభియోగాన్ని తీవ్రంగా ఖండించారు. అప్పటికి కమ్యూనిజమంటే సోషలిజమే అని అందరి అవగాహన. అయితే సోషలిస్టులు ప్రైవేటు ఆస్తిని రద్దు చేయాలంటారు (పత్రిక పెట్టుబడిదార్లందరూ వ్యాపారస్తులే మరి!). కొలోన్ నగరమంతా తిరిగి, దేశంలో ప్రచురించబడిన ఇతర పత్రికలు చదివి, తన పరిచయస్తుల ద్వారా కొన్నిసార్లు దుర్లభమైన సమాచారం కూడా సేకరించి బలమైన వాదనలతో పత్రికలో వ్యాసాలు రాశాడు మార్క్స్. ఆయన సంపాదకత్వంలో, ప్రష్యాలోని ఉదారవాదుల గళంగా మారింది రైనిష్ జైటుంగ్.

మార్క్స్ నాయకత్వంలో దేశంలోని ప్రతిభావంతులైన రచయితలందర్నీ ఆకర్షించింది పత్రిక. అయినప్పటికీ చివరి నిర్ణయం మార్క్స్ మాత్రమే తీసుకుంటాడు. ఈ కాలంలోనే కొందరు తగ్గి 'నియంత' అన్నారు. అతడి అనుమతి లేకుండా, పత్రికలో ఏదీ అచ్చు కావటానికి వీల్లేదు – చివరికి బెర్లిన్‌లోని యంగ్ హెగెలియన్ల వ్యాసాన్నైనా సరే కేవలం పిడివాదం కాదు. హేతుబద్ధత కావాలి. సమాచారం నిక్కచ్చిగా ఉండాలి. వాగాడంబరం

కాదు. స్పష్టత సరళత కావాలి. ఆత్మస్తుతి ఉండకూడదు. సహజంగానే తమను తాము స్వేచ్ఛా మేధావులమని చెప్పుకున్న యంగ్ హెగెలియన్ల మార్క్స్‌ను 'కన్సర్వేటివ్'గా ముద్రవేశారు. 'ఈ వాగుడుకాయల నిందలనైనా భరిస్తాను గాని పత్రిక విశ్వసనీయతను మాత్రం త్యాగం చెయ్యను' అన్నాడు మార్క్స్.

మార్క్స్ పత్రికా సంపాదకుడిగా నియమింపబడటానికి ఒకరోజు ముందు అక్టోబర్ 14నాడు ఇరవై మూడేళ్ల సోదరుడు హెర్మాన్ మరణించాడు. అయినా మార్క్స్ అంత్యక్రియలకు హాజరైనట్టుగా దాఖలా లేదు. కొలోన్‌లో, కూర్చుని తన ముందున్న రెండు వ్యాసాల గురించి తీవ్రంగా ఆలోచించాడు మార్క్స్ ఆ తర్వాత వీటి గురించే మాట్లాడుతూ 'రాజకీయాల నుండి ఆర్థిక విషయాల వైపు అంటే సోషలిజం వైపు మళ్లటానికి ఇవే కారణం' అని తర్వాతి రోజుల్లో ఎంగెల్స్‌తో చెప్పాడు. తన పరిశోధనల ద్వారా మరో విషయం కూడా గ్రహించాడు. వ్యక్తుల మధ్య సంబంధాలు మౌలికంగా భౌతికమైనవే అంటే ఆర్థిక పునాది మీద ఏర్పడినవే.

ఆ రెండు వ్యాసాలలో మొదటిది : ప్రైవేటు అడవుల్లో రైతులు కలప ఏరుకోవటం గురించి. ప్రష్యన్ ప్రభుత్వం ఇటీవలే ఈ చర్యను దొంగతనంగా ప్రకటించింది. తరతరాలుగా నిరుపేదలు అడవుల్లో పడివున్న కలపను సేకరిస్తూనే వున్నారు. ముఖ్యంగా చలి కాచుకోవటానికి. 1807లో అర్థబానిస వ్యవస్థ రద్దయిన తర్వాత కూడా ఇది కొనసాగింది. కాని 1840 నాటికి, పరిశ్రమల వాళ్లు ఈ కలప భూస్వాముల వద్ద మంచి ధరకు కొంటామన్నారు. ప్రభుత్వం, భూస్వాములకు (ప్రభుత్వంలోని అన్ని హోదాలలో వున్నది వీళ్లే) వత్తాసు పలికింది. పేదల వలస సేకరణను నేరంగా పరిగణించింది. మార్క్స్ దీని గురించి రాసేనాటికి 'దొంగతనాలు' ఎంతగా పెరిగాయంటే ప్రష్యాలోని ఆరింట అయిదు వంతుల కోర్టు కేసులు ఇవే. ప్రకృతి వరంగా ఇచ్చినదాన్ని భూస్వామి అమ్ముకుంటున్నాడని అభిశంసించాడు మార్క్స్. ఈ కొత్త చట్టం, ఎంతగా భూస్వాములకు వత్తాసు పలుకుతున్నదంటే, ఈ కలప దొంగల వల్ల పాపం భూస్వామికి చలి కాచుకోవటానికి కలపే మిగలటం లేదు' అని చురక అంటించాడు.

రెండవ వ్యాసం, జర్మన్ రాష్ట్రాల మధ్య స్వేచ్ఛా వాణిజ్యమూ, సరుకుల మీద పన్నులు వేసే విధానమూ ఉండటం వల్ల మోసెల్ ద్రాక్ష తోటల పెంపకం దార్ల పేదరికంలో మగ్గిపోవటం గురించి. రైనిష్ జైటుంగ్'లో పెట్టుబడి పెట్టిన వ్యాపారస్తులకు స్వేచ్ఛా వాణిజ్యం లాభసాటిగానే కనిపించింది. దీనివల్ల తమ మార్కెట్లు పెంచుకునే అవకాశముంది. కాని మార్క్స్‌కు తెలుసు. చిన్న రైతుల పొట్టగొడితే తప్ప పెద్ద రైతులు లాభాలు గడించరు. పెద్ద రైతుల మార్కెట్లో, చిన్న రైతులు పోటీని తట్టుకుని నిలబడలేరు.

తన పత్రిక పాఠకులు కూడా ఎక్కువమంది మధ్యతరగతి వాళ్లే. అందరూ స్వేచ్ఛా వాణిజ్యాన్ని సమర్థించేవాళ్లే. ఇలా రాయటం పత్రిక వాటాదారులకు నచ్చదు. అంటే తన ఉద్యోగానికే ముప్పు రావచ్చు. అయినప్పటికీ రైనిష్ జైటుంగ్' అతిత్వరలో రాడికల్ ధోరణిని ప్రదర్శించింది. రైన్‌లాండ్ పార్లమెంట్ చర్చల్నీ, బెర్లిన్‌లోని ప్రభుత్వాన్ని నిశితంగా విమర్శించింది. అయితే, విషయ విశ్లేషణలో అందులోని వ్యాసాలనెవరూ తప్పు పట్టలేదు.

మొదటి సంవత్సరంలోనే నాలుగు వందల నుండి మూడు వేల అయిదు వందలకు పెరిగాయి చందాలు. ఎంత ఘాటుగా రాసినా సెన్సార్ల చేతుల నుండి జారిపోతూనే ఉన్నాయి వ్యాసాలు. అయితే, పత్రికకు రాసేవాళ్లతో మార్క్స్‌కు చికాకు తప్పలేదు. వాళ్లు సైద్ధాంతికంగా రాస్తారు. లేదా అభిప్రాయాలు ప్రచారం చేస్తామంటారు. కేవలం వాస్తవ విషయాలు మాత్రమే రాయలంటాడు మార్క్స్.

సశేషం

▪ ఫోన్: 91776 18708

పంజాబీ ప్రేమికుడు

పరాయి భాషను అవసరార్థం నేర్చుకునేవారు ఎందరో వున్నారు. అయితే అన్య భాషమీద అనంతమైన ప్రేమాభిమానాలను పెంచుకొని .. దాని అభివృద్ధికై అనుక్షణం తపనపడేవారిని అరుదుగా చూస్తుంటాం. ఇవాళ మన ముందుకు వచ్చిన పండిట్ రావ్ సి. ధరేన్నవర్ ఆ కోవకు చెందినవాడే.

పుట్టింది కర్నాటకలోని బీజపూర్‌లో. ఢిల్లీలోని జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీలో సోషియాలజీలో మాస్టర్స్ డిగ్రీ పొందారు. ఎంఫిల్ కూడా చేశారు. చండీగఢ్‌లో తొమ్మిదేళ్ల కిందట సోషియాలజీ అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా చేరారు. అప్పుడు మొదలైంది ఆయనకు పంజాబీ పట్ల ప్రేమ. అవసరం కూడా. "నేను ఇంగ్లీషులో పాఠాలు బోధించాల్సి వచ్చేది. కానీ అది వారికి అర్థమయ్యేది కాదు. దాంతో నేనే పంజాబీ నేర్చుకోవాల్సి వచ్చింది". ఆ క్షణం నుంచీ పంజాబీ నేర్చుకోవాలని ఎంతగానో తపించిపోయాడు. నేర్చుకున్నారు. ఇప్పుడాయన ఎంత అనర్గళంగా పంజాబీ మాట్లాడతారంటే... పూర్తి యాసతో...అచ్చంగా పంజాబ్ పౌరుల మాదిరిగా. ఎవరైనా ఇంగ్లీషులో మాట్లాడబోతే... అభ్యంతర పెట్టేస్తారు కూడా. అధికారిక ప్రత్యు త్తరాల్లో సైతం గుర్ముఖి లిపినే ఉపయోగిస్తుంటారు. ఇప్పుడాయన లక్ష్యం ఒక్కటే పంజాబ్, కన్నడ సంస్కృతుల మధ్య ఒక వారధిని నిర్మించాలి. అదీ పంజాబీతోనే. తను పని చేసే యూనివర్సిటీలో మూడింటికి తరగతులు అయిపోతాయి. అక్కడి నుంచి అక్కడికి 15 కిలోమీటర్ల దూరంలో వున్న ధనాస్ గ్రామం వెళ్తారు. అక్కడ 20-30 మంది పిల్లలకు రెండు గంటల పాటు పంజాబీ నేర్పుతారు. బదులుగా ఎటువంటి ఫీజు తీసుకోరు. పైగా తనే ఒక్కో విద్యార్థికి వంద రూపాయల చొప్పున ఇస్తుంటారు. పంజాబీ నేర్చుకున్నందుకు అభినందన పూర్వకంగా. రావ్ అనేక సిక్కు రచనలను కన్నడలోకి అనువదించారు. అందులో శ్రీ జప్ జి సాహెబ్, శ్రీ శుఖ్‌మణి సాహెబ్ గ్రంథాలున్నాయి. ప్రస్తుతానికి సిక్కుల పవిత్ర గ్రంథమైన గురు గ్రంథ సాహిబ్ అనువాదం చేస్తున్నారు. "ప్రతి రోజూ తెల్లవారు ఝూమున 4 గంటల నుంచి 8 గంటల వరకు అనువాదం చేస్తాను. ఇప్పటికి 40 శాతం పని పూర్తయింది. తర్జుమా చేసిన వాక్యానికి సంబంధించిన అర్థాన్ని కూడా ఇస్తాను...' అంటారు రావ్. ఇప్పటికి ఆయన 20 పుస్తకాలను అనువదించారు. పాటియాలా లోని పంజాబ్ యూనివర్సిటీ పండిట్ రావ్ చేస్తున్న సేవల మీద పరిశోధన ప్రారంభించింది. మరో విశేషం ఏమంటే ... రావ్ భార్య శ్రీదేవి కూడా పంజాబీ నేర్చుకున్నారు. వీరి నాలుగేళ్ల కుమారుడు సైతం పంజాబీ గలగలా మాట్లాడేస్తాడు. వీరంతా ఇంట్లో వుంటే సంభాషణ అంతా పంజాబీలోనే జరుగుతుంది.

★

గవ్వల గూడు

ఎవరి ఇష్టాలు వారివి. ఎందుకలా? అంటే సమాధానాలుండవు. ఇష్టం అంతే. రామ్‌గోపాల్‌వర్మ మాటల్లో చెప్పలంటే 'నా ఇష్టం'. అంతే. ఇదిగో మీ ఎదురుగా వున్న ఈ బుజ్జి భవనం కూడా అలాంటి ఓ పెద్దమనిషి కట్టుకున్నదే. ఇతగాడి పేరు జియావో యోంగ్‌షెంగ్. వయసు 58. చైనాలోని షాండాంగ్ ప్రావిన్స్ వాసి. ఇతగాడి ఇల్లు సముద్రపు ఒడ్డుకు దగ్గరగా వుంటుంది. ఓసారి తన ఇంటిని బాగు చేయించాల్సి వచ్చింది. డబ్బు ఖర్చు పెట్టినా దానికి తగ్గ ఫలితం వుండాలన్నది జియావో కోరిక. ఏం చేస్తే బాగుంటుందా? అని తెగ ఆలోచించాడు. ఓసారి ఆ ఆలోచన చేస్తూ సముద్రపు ఒడ్డున నడుస్తూ వుండగా... రంగు రంగుల గవ్వలు కనిపించాయి. ఇంకేం కావాలి? వెంటనే తన 1500 చదరపు మీటర్ల ఇంటిని గవ్వలతో అలంకరించాలనుకున్నాడు. ఇక చూస్కోండి! కనిపించిన గవ్వనల్లా సేకరించాడు. అలా రెండేళ్లపాటు పోగు చేసిన గవ్వలతో ఇంటిని అద్భుతంగా తీర్చిదిద్దాడు. ఇందులో ప్రత్యేకంగా ప్రస్తావించుకోవాల్సిన విషయం ఒకటుంది. ఈ గవ్వలు మూడు మిల్లీమీటర్ల పొడవున్న వాటి దగ్గర నుంచి 4 కిలోల బరువున్న వాటి వరకు వున్నాయి. ఇప్పుడక్కడ జియావో ఇల్లే ప్రత్యేక ఆకర్షణగా నిల్చిందనుకోండి.

కుక్క మీద ప్రేమ రాతలా!

పావురాళ్లతో సందేశాలు, ఉత్తరాలు, ఈమెయిళ్లు, ఎస్సెమ్మెస్సులు...ఎన్ని లేవు చెప్పండి ప్రేమ ప్రదర్శించడానికి. కానీ పోలిష్ వైద్య విద్యార్థి మాత్రం తన ప్రియురాలికి ప్రేమ సందేశాన్ని శునకం ద్వారా పంపాడు. ఎలా? అంటే ... అదో చిన్ని కథ. ఇతగాడు 'వార్మియా అండ్ మజౌరీ' యూనివర్సిటీలో వెటర్నరీ కోర్సు నాల్గవ సంవత్సరం చదువుతున్నాడు. వైద్యం చేసిన కుక్క పొట్ట మీద 'నేను నిన్ను ప్రేమిస్తున్నాను' అని రాసి ఫొటో తీసి ప్రేయసి ఫేస్‌బుక్ వాల్ మీద పెట్టేశాడు. ఇక చూస్కోండి? అ మరుక్షణం నుంచి ఎంత చర్చ ప్రారంభమైందో! అసలు అలా ఎలా కుట్టేశాడు కుక్కమీద? అది అనైతికం. తెలివితక్కువనం. బుద్ధితక్కువతనం. ... ఇలా నడుస్తోంది ఫేస్‌బుక్‌లో మాటల యుద్ధం. అయితే ఆ ప్రేయసి ఏమందో తెల్సా! 'ఇందులో అనైతికత ఏముంది? తను కుట్టడం నేర్చుకున్నాడు. అదే ఇలా ప్రదర్శించాడు...' అని దబాయించింది. ఆమె కూడా వైద్య విద్యార్థినే అనుకోండి. అయితే అందరూ ఆమెలా కాకుండా జంతువుల హక్కుల గురించి ఘాటుగానే స్పందించారు. యూనివర్సిటీలో పశువైద్య విభాగాధిపతి కూడా మెత్తగానే అయినా అతగాణ్ణి మందలించాడు. 'నేను నిన్ను ప్రేమిస్తున్నాను అని చెప్పడంలో తప్పులేదు. కాకపోతే కుక్క పొట్ట మీద అలా రాయడం అనైతికం. పశువైద్య విద్య అభ్యసిస్తున్న విద్యార్థిగా అలా చేసి వుండకూడదు' అన్నాడు. పైగా ముందు ఫేస్‌బుక్‌లోంచి ఆ ఫొటోను తీసేయమని కూడా కొందరు గట్టిగానే చెప్పారు.

నీకోసం నేనున్నానని...

వృద్ధాప్యంలో వేధించే అతి పెద్ద సమస్య ఒంటరితనం. ఎవరికి వారు చదువులకు, ఉద్యోగాలకు వెళ్లిపోతే ... ఇక వృద్ధులకు దిక్కెవరు? ఒంటరిగా శూన్యంలోకి చూస్తూ కూర్చోవాల్సిందేనా! అదిగో అలాంటి వారికోసమే జపాన్‌వారు ఓ కుర్చీని తయారు చేశాం అంటున్నారు జపాన్ వ్యాపారస్తులు. చూడ్డానికి కుర్చీలో ఒక పెద్ద బొమ్మ వున్నట్టున్నా... ముసలి ప్రాణాలకు నేనున్నానంటూ భరోసానిస్తాయంటున్నారు. పిల్లలు తమ పక్కనే వుండి రెండు చేతులతో ఓదార్చుతున్నట్టు... జోకొడుతున్నట్టు...అనిపించే కుర్చీని చూసిన కస్టమర్లు... ఇటీవల జపాన్‌లో జరిగిన ఓ ఎగ్జిబిషన్‌లో ఈ కుర్చీ పట్ల ప్రత్యేక ఆసక్తిని కనబరిచారట. పైగా జపాన్‌లో 65 సంవత్సరాలు పైబడిన వారి సంఖ్య ఎక్కువగానే వుందని సమాచారం. అతి త్వరలోనే ఆ సంఖ్య మరింత పెరగనుందట కూడా. ఎప్పటికి ఏది అవసరమో అది తయారుచేసి సొమ్ము చేసుకునేవాడే కదా మంచి బిజినెస్‌మేన్. ఆ విద్యలో ఆరితేరిన జపాన్ వ్యాపారస్థులకు ఇలాంటి ఐడియాలు రావడంలో వింతేముంది? ఇంతకీ కుర్చీ ధర ఎంత అనుకున్నారు? ఎంతా! సింపుల్‌గా 419 డాలర్లే.



ఈ ఛండాలం మాకొద్దు

◆ ప్రత్యేకం

మనం స్వతంత్రులం. 65 సంవత్సరాలుగా స్వేచ్ఛా వాయువులను ఆస్వాదిస్తున్నాం. దాదాపు నలభై ఏళ్లగా మహిళా దినోత్సవాలు జరుపుకుంటున్నాం. అయినా సరే. వైరుధ్యాలు, వివక్షలు, అంతరాల్లో మార్పు లేదు. చిన్న చిన్న పట్టణాలు, గ్రామాలు, నగరాల్లో సైతం పరాయిభావన, వివక్ష వెంటాడుతూనే వున్నాయి. ప్రభుత్వం నిషేధించిన వృత్తులు నేటికీ కొనసాగుతూనే వున్నాయి. మానవ మలమూత్రాలను శుభ్రంచేసే పనిని తరతరాలుగా చేస్తూనే వున్నారు.

బబిత! రెండు పదుల వయసు వుంటుందేమో! రాజస్థాన్ లోని వాల్మీకి అనే కుగ్రామ వాసి. ప్రభుత్వం ఏనాడో నిషేధించిన పారిశుధ్య పనినే ఇంకా చేస్తోంది. వెదురుబుట్ట, రేకుముక్క, చీపురుతో రోజుకు పది పదిహేను మరుగుదొడ్లను శుభ్రం చేస్తుంది. 'ఈ రోజుల్లో కూడా ఇదే పనా?' అనిపించినా... పుట్టింటివారు, మెట్టినింటివారు ... బబిత ఆ పని చేయాలని కోరుకుంటున్నారు. కారణం లేకపోలేదు. బతకడానికి మరో మార్గం లేకనే ఆ కంపు పనిలోనే మగ్గిపోవాలనుకోవడం. 'మాకు వారసత్వంగా వచ్చిందీ పని. ఇంకేం చేయగలం' అంటాడు ఆమె మామగారు నిర్వేదంగా. 'ఈమెకు ఐదుగురు పిల్లలు. మొదటి నల్గురు ఆడపిల్లలు. వారి భవిష్యత్తు కోసం ఏదో ఒకటి చేయాలిగదా?' అంటుంది అత్తగారు. బబిత ఒక్కటే కాదు! ఇలాంటి వారెందరో అదే వృత్తిని కొనసాగిస్తున్నారు. సోనా దేవి అత్తగారిది ఓ విషాద గాథ. ఆమె ఒట్టి చేతులతో ... మానవ ఛండాలాన్నంతా ... ఏళ్ల తరబడి ఎత్తడంతో... మానసికంగా దెబ్బతింది. ఇప్పుడామె సొంత ఇంట్లోనే బంధీ. కాళ్లకు వేసిన తాళ్లతో కలిసి బతుకుతోంది.

సుదీర్ఘ పోరాటానంతరం...పారిశుధ్య పని నిషేధం– పునరావాసంపై 2013లో చట్టం వచ్చింది. వట్టి చేతులతో మలమూత్రాలను ఎత్తివేసే పని చేయకూడదని ప్రభుత్వాలు, సంబంధింత మంత్రిత్వ శాఖలు, అధికారులు ... చెప్తున్నారు. ఈ విధమైన పారిశుధ్య పనిని కొందరు మానేశారు. కానీ... వీరికి ఇల్లు గడిచేదెట్లా? కుటుంబం నడిచేదెట్లా? ప్రభుత్వాలు ఏర్పాటు చేసిన పునరావాస శిక్షణా కార్యక్రమాలకు వెళ్తున్నారు కొందరు. ఇళ్లల్లో ఖాళీగానే వున్నారు మరికొందరు. సోనా దేవి, రజనీ దేవి, మున్ని దేవి... వంటి ఔత్సాహికులు... మూడు మాసాలపాటు...ప్రభుత్వం ఏర్పాటు చేసిన స్వయం ఉపాధి పథకం కింద కుట్టు పని నేర్చుకున్నారు. సొంత కాళ్ల మీద నిలబడడానికి... కుట్టు మిషన్లు ఇస్తామని, స్వయం ఉపాధి పథకం కింద రుణాలిస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చింది. వీరంతా సంతోషంగా దరఖాస్తులు పూరించి ఇచ్చారు. ఇంకా కుట్టుమిషన్ల కోసం, రుణాల కోసం...కళ్లు కాయలుకాచేలా ఎదురుచూస్తున్నారు.

'మేం ప్రతి రోజూ శిక్షణకు వెళ్లాం. మాకు కుట్టు నేర్పడానికో మహిళ, ఆరు మిషన్లు వున్నాయి. మేం డెబ్బై మందిమి. ఎక్కువరోజులు మిషన్ మరమ్మతులోనే వుండేది. కత్తెర, బట్ట, సూది, దారాలను ఇంటి దగ్గర నుంచే తెచ్చుకునేవాళ్లం. జాకెట్ ఎలా కుట్టాలో మాత్రమే టీచర్ చెప్పారు. మిషన్ వచ్చినప్పుడు కుట్టడానికి అదంతా గుర్తు వుంటుందనుకుంటున్నాం' అంటోంది మున్ని దేవి.

ఇవాళ ఈ చట్టం వచ్చిందనే కాదు. దశాబ్దాల కిందటి నుంచే ఈ పని నుంచి విముక్తి పొందడానికి అలుపెరగని పోరాటం చేస్తూనే వున్నారు. వారిలో మధ్యప్రదేశ్‌కి చెందిన చోటీబాయి ఒకరు. 2002వ సంవత్సరంలో ఆమె ఈ ఉద్యమంలో పాల్గొన్నందుకు ఇంటి నుంచి గెంటివేశారు అత్తగారు. గ్రామ పెద్దల బెదిరింపులే అందుకు కారణం. అదే చోటీబాయి ఇవాళ .... లాడ్ కన్వర్, బాదామి బాయి, లాలి బాయి వంటి అనేక మంది మహిళలతో కలిసి దేశవ్యాప్త ప్రచారం చేస్తోంది. ఛండాలాన్ని ఎత్తివేసే బుట్టలను తగలబెట్టి ... గౌరవ ప్రదంగా బతకమని కోరుతోంది. వీరంతా కలిసి... 2012లో పద్దెనిమిది రాష్ట్రాల్లోని రెండువందల జిల్లాల్లో పదివేల కిలోమీటర్ల దూరం మార్చ్ చేశారు .

ఇన్ని పోరాటాలు జరుగుతున్నా, చట్టాలున్నా... ఆ వృత్తి నేటికీ వుంది. అనేక రాష్ట్రాలు దీనిని వ్యతిరేకిస్తున్నా... 2011 లెక్కల ప్రకారం నేటికీ చేత్తో శుభ్రంచేయాల్సిన కక్కసు దొడ్లు 7,94,390 వున్నాయి. వీటిలో 73 శాతం గ్రామీణ ప్రాంతాల్లోను, పట్టణ నివాసాల్లోను వున్నాయి. మరో 12,14,652 మరుగుదొడ్లను... సరాసరి నాళాలకు కలపడంతో... ఛండాలం అంతా అక్కడకు చేరుకుంటుంది. పరిస్థితి ఇలా వుంటే... ఈ వృత్తి మానివేసిన వారి పునరావాసం కోసం ఏర్పాటు చేసిన పథకాల ఫలాలు...వారికి అందని విషాదం మరొకటి. అందుకేనేమో! ఛండాలాన్నెత్తే బుట్టలను తగలబెట్టడానికి వెనకాడుతున్నారు కొందరు. అలాంటివారికి బబిత, భురా దేవి, మీనా...సజీవ సాక్ష్యాలుగా నిలుస్తున్నారు.

★

బాగా ఆకలిగా వుంది. టిఫిన్ తిందామని రెస్టారెంట్‌కెళ్లాం. తీరా తిన్నాక...
మన బిల్లు మరెవరో కట్టేశారని తెలిస్తే! ఎలా వుంటుంది? ఆటో ఎక్కాం.
కానీ మీటరుతో పనిలేదు. మనం ఇచ్చినంతే అతను తీసుకుంటాడని,
నిర్ణయం మనదేనని తెలిస్తే! జాతీయ పండుగల సందర్భంగా...ఉచిత ఆటో సేవలు
అందుతాయని తెలిస్తే! 'నో చాన్స్!' అనుకుంటున్నారేమో!
అహ్మదాబాద్, చెన్నై నగరాలలో ఈ సేవామూర్తులు అగుపిస్తారు.
వారి గురించి తెల్సుకుందాం పదండి.

◆ మనసు

మీ సేవకై...



మీదే నిర్ణయం

ఉదయ్! ఆటో నడుపుతుంటాడు. విశేషం ఏమంటే... ఇతను తెలియని వారుండరు అహ్మదాబాద్‌లో. ఆటో తోలే అతనికి ఇంత అభిమానగణమా! అనుకోవచ్చు. మరి అతను ఆటో నడిపే విధానం అలాంటిది. అతను మీటరు అస్సలు వేయడు. ఎప్పుడూ సున్నా మీదే వుంటుంది. ఎక్కడికైనా కానివ్వండి. ఎంత ఇవ్వాలనేది నిర్ణయించుకోవాల్సింది కస్టమరే. విజ్ఞతతో ఇవ్వాల్సి వుంటుంది. కొందరు తక్కువ ఇవ్వొచ్చు. మరికొందరు అతని సేవాగుణానికి మెచ్చుకొని ఎక్కువే ఇచ్చేస్తుంటారు. మొత్తంమీద ఈ పద్ధతుల్లో ఆటోనడుపుతూ...కుటుంబాన్ని పోషిస్తున్నాడీ ముగ్గురు పిల్లల తండ్రి.

ఆటో అన్న

అన్నా దొరై! చెన్నైలో ఆటో డ్రైవర్. ఇతగాడు ఆటో నడిపే రూటే సపరేటు. నిజానికి అది ఆటోలా వుండదు. అదేదో మేగజైన్ షాప్‌లా వుంటుంది. వైఫై, సెల్‌ఫోన్ చార్జింగ్ సౌకర్యం కూడా ఆటోలో వున్నాయి. కస్టమర్లకు బోర్ అనేదే వుండదు. కావాలంటే..ఆటోలో వున్న పత్రికలు చదువుకోవచ్చు. ట్యాబ్ వుపయోగించి సినిమాలు చూడొచ్చు. అన్నీ ఉచితంగానే. ఇక జాతీయ దినోత్సవాలప్పుడు ఉచితంగా సేవలు అందిస్తాడు. స్నేహితుల దినోత్సవం, తల్లుల దినోత్సవం, తండ్రుల దినోత్సవం, నర్సుల దినోత్సవం...ఇలా ప్రత్యేకమైన రోజుల్లో వారికి ప్రత్యేకమైన ఆఫర్లు ఇస్తాడు. ఉదాహరణకు మదర్స్ డే రోజున తన ఆటో ఎక్కిన తల్లీబిడ్డలకు ... మీటరులో సగం మాత్రమే తీసుకుంటాడు. మహిళా దినోత్సవం రోజున 50 ఏళ్లు పైబడిన వారిని ఉచితంగా గమ్యస్థానాలకు చేరుస్తాడు. ఫాదర్స్ డే రోజున 45 ఏళ్లు పైబడిన వారికి ఉచిత సర్వీస్ అందిస్తాడు. స్వతంత్ర దినోత్సవం నాడు ఉచితంగా ఆటో నడుపుతాడు. తన పుట్టినరోజు నాడు యాభై శాతం రిడక్షన్ ఇస్తాడు. ఇక ప్రేమికుల దినోత్సవం నాడు ... లవర్స్‌కు ఉచిత ఆటో సేవలు అందిస్తాడు. ఇది కాక తన కస్టమర్లందరికీ చాక్లెట్ ఇస్తాడు. వీధి బాలల చదువుకోసం తన ఆదాయంలో సింహభాగాన్ని వెచ్చిస్తుంటాడు. యువత, స్కూలు పిల్లలు అతన్ని 'ఆటో అన్న' అంటూ తమ అభిమానాన్ని చాటుకుంటుంటారు.

సేవా కేఫ్!

గుజరాత్ రాజధాని అహ్మదాబాద్‌లో వుందీ రెస్టారెంట్. ఔత్సాహిక స్వచ్ఛంద సేవకులు కొందరు నడుపుతున్నారు. అమెరికాకు చెందిన స్వచ్ఛంద సంస్థ సహాయసహకారాలు కూడా దీనికి వున్నాయి. ప్రేమతో సేవ చేయాలన్నది వారి లక్ష్యం. అక్కడ అన్ని రకాల ఆహార పదార్థాలు లభిస్తాయి. కాకపోతే పైసలు చెల్లించాల్సిన పనిలేదు. మనం అక్కడకు వెళ్లి తినడానికి ముందే ఎవరో మన బిల్లు కట్టేస్తారు. మనం చేయాల్సిందల్లా... మన తర్వాతి వారికి మనం చేయగలిగిన సాయం చేయడమే. మన జేబు అనుమతించిన మేరకు తరువాతి కస్టమర్ బిల్లు కట్టేయడమే. కొందరు కొంత మేర మాత్రమే డబ్బు కట్టగలిగినా... దానగుణం గల వారు పెద్దమొత్తంలో ఇస్తుంటారు. దాంతో ... ఒకచోట తగ్గినా...చివరికి బ్యాలన్స్ అవుతుంటుంది ఖర్చు. ఈ సేవా కేఫ్ ఆలోచన సిద్ధార్థ్ స్టలేకర్‌ది. ఈ రెస్టారెంట్ గురించి, అక్కడ అందుతున్న సేవల గురించి విన్న కొందరు యువత బెంగళూరు, చెన్నై, పూనా, ముంబై వంటి నగరాల్లో తమ వంతు ప్రయత్నం చేయసాగారు. బెంగళూరులో అనుప్రీత్ థోడీ, సుశీల్ నాయర్ తాము నడుపుతున్న వృక్ష్ రెస్టారెంట్‌లో ప్రయోగాత్మకంగా ఒకరోజు ఈ పద్ధతిని పెట్టారు. 70 మందికి ఆహార సౌకర్యం కల్పిద్దామనుకున్నవారు... రోజు ముగిసేసరికి ... 135 మందికి కడుపునిండా భోజనం పెట్టగలిగారు.

◆ అట్టమీది కథ

సో... స్మార్ట్...

స్మార్ట్ ఫోన్! యూత్ యావంతా దీని గురించే. ఇది పాకెట్‌లో వుంటే ఓకే! లేకపోతే... కొనేదాకా...నో నిద్ర. నో తిండి. రేటు గురించి డోన్ట్ కేర్. ఏ ఖర్చైనా మానుకునేందుకు రెడీ. బట్... 'స్మార్ట్' కావాల్సిందే. ఇదండీ పరిస్థితి. ఈ మేనియాలో పడి కొట్టుకుపోతోంది యువత. మార్కెట్ వుండాలేకానీ... అమ్మేవాడు మరింత రెచ్చిపోడూ. పోటీపడి మరీ ... మార్కెట్‌ని నింపేసి... మనీ చేసుకుంటున్నాడు. ఇటువంటప్పుడే మనం తెలివిగా వుండాలి. మార్కెట్‌కి వెళ్లక ముందే... కొనే వస్తువు గురించిన పూర్తి వివరాలు తెలుసుకోవాలి. జాగ్రత్తలూ తీసుకోవాలి.

అనంతోజు మోహన్ కృష్ణ

స్మార్ట్ ఫోన్ కొనాలని ఉంది. కానీ ఏది కొనాలి? డిస్‌ప్లే ఏది బాగుంటుంది? ఏమేం ఫీచర్స్ వుండాలి? పిచ్చ గందరగోళం. ఏ వాణిజ్య ప్రకటన చూసినా... మా ఫోన్ మంచిదంటే మాది మంచిదని ఊదరగొడుతుంటారు. అలాంటప్పుడు ప్రతీ మోడల్‌లో ఏమేం ఫీచర్లున్నాయో తెలుసుకోవడం కొంచెం కష్టమే. అందుకు కొందరు స్మార్ట్‌గా ఇంటర్నెట్‌ని ఆశ్రయిస్తుంటారు. పూర్తి వివరాలు తెలుసుకుని నచ్చిన ఫోన్‌ని కొనుగోలు చేస్తుంటారు. అయితే కొందరికి ఆ పాటి సమయం ఉండకపోవచ్చు. ఇంటర్‌నెట్ మీద అవగాహన ఉండకపోవచ్చు. అప్పుడు ఏం చేయాలి?

బడ్జెట్

అన్నింటికంటే ముందు మన బడ్జెట్ ఎంతో నిర్ణయించుకోవాలి. తర్వాత మన బడ్జెట్‌కి అందుబాటులో వున్న ఆపరేటింగ్ సిస్టమ్ ఏదో చూసుకోవాలి. కీ బోర్డ్ అనువుగా వుందో లేదో ఒకటికి రెండుసార్లు చెక్ చేసుకోవాలి. ముఖ్యంగా ఫోన్ సైజ్‌ను చూసుకోవాలి. చేతిలో ఇమిడి పోతుందో లేదో గమనించాలి. ఆ తరువాత డిజైన్, లుక్ గమనించాలి. ఫీచర్స్‌తోపాటు ఆకర్షణీయమైన మోడల్‌ను ఎంచుకోవాలి. వీటితోపాటు మరికొన్ని విషయాలను కూడా గమనించాలి.

డిస్‌ప్లే

ఫోన్ ఎంత స్లిమ్‌గా (చిన్నది) ఉంటే అంత స్టైల్‌గా భావించేవారు ఒకప్పుడు. కానీ ఇప్పుడు స్క్రీన్ పెద్దగా ఉండటమే ఫ్యాషన్. కనీసం 5 అంగుళాల డిస్‌ప్లే ఉన్న ఫోన్ ఎంచుకోవడమే ఇప్పటి ట్రెండ్. మార్కెట్‌లో వీటికే ఆదరణ ఉంది. పిక్సెల్ కౌంట్ 720 వుంటే చాలా నాణ్యమైన ఫొటోలు చూడవచ్చు. డిస్‌ప్లే సైజు పైనే ఇది ఆధారపడి ఉంటుంది. మంచి రిజల్యూషన్ ఉన్నప్పుడు మాత్రమే మంచి ఫొటోలు, వీడియోలు తీసుకోవడానికి చూడడానికి కూడా బాగుంటుంది.

ర్యామ్

స్మార్ట్‌ఫోన్ అనగానే... ముందు గుర్తుకు వచ్చేది యాప్. స్మార్ట్ ఫోన్ ... ప్రతి పనికి యాప్స్ మీద ఆధారపడుతుంది మరి. గేమ్స్, బూటింగ్ ... ఇలా ప్రతిదానికీ యాప్స్ అవసరం. ఇన్ని యాప్స్ వాడాలంటే దాని ర్యామ్ ఎంత ఉండాలి? కనీసం 2జిబి కావాలి. అందుబాటులో లేకపోతే మినిమం ఒక జిబి ర్యామ్ అయినా ఉండేది ఎంచుకోవాలి.

స్టోరేజ్ (మెమరీ)

ఫొటోలు, వీడియోలు, ఇతర ఫైల్స్... ఇలా ఏది ఫైల్ చేసుకోవాలన్నా మెమరీ అవసరం. ఒకరకంగా చెప్పాలంటే స్మార్ట్ ఫోన్ అంటే ఒక పర్సనల్ కంప్యూటర్‌కు ఏమాత్రం తీసిపోకుండా ఉండేది. ఇప్పుడు వచ్చే ఫోన్లలో దాదాపుగా 16 జిబి మెమరీ ఉంటుంది. దీన్ని పెంచుకునే అవకాశం కూడా ఉంటుంది.

బ్యాటరీ

ఎన్ని యాప్స్ ఉన్నా ...ఎంత స్టోరేజ్ కెపాసిటీ ఉన్నా... ఎన్ని ఫీచర్లు ఉన్నా... బ్యాటరీ పక్కాగా వుండాలి. అది సరిగ్గా లేనప్పుడు అవన్నీ ఉన్నా లాభం లేనట్టే. కాబట్టి స్టాండ్ బై ఎంత? టాక్ టైం ఎంత? ఎన్ని గంటలు ఛార్జింగ్ ఆగుతుంది? లాంటి వివరాలు ముందే తెలుసుకోవాలి.

కెమెరా

స్మార్ట్ ఫోన్‌లో కేవలం కెమెరా మాత్రమే కాకుండా ... కార్డ్ స్కానర్, ఓసిఆర్, ఫేస్ ట్రాకింగ్... వంటి పనులకు ఉపయోగపడుతుందో లేదో తెలుసుకోవాలి.

ఆపరేటింగ్ సిస్టమ్

మార్కెట్లో ఆండ్రాయిడ్, ఐఓఎస్, విండోస్, బ్లాక్ బెర్రీ వంటి ఆపరేటింగ్ సిస్టమ్‌లు అందుబాటులో ఉన్నాయి. ఫోన్ కొనేముందే... ఏ ఆపరేటింగ్ సిస్టమ్ ఉన్న మొబైల్ కావాలో నిర్ణయించుకోవాలి. ఐఫోన్‌కు ఐఓఎస్ ఆపరేటింగ్ సిస్టమ్, నోకియాకి – మైక్రోసాఫ్ట్ విండోస్, శామ్‌సంగ్ – సెల్‌కాన్, మైక్రోమాక్స్ వంటి మోడల్స్‌లో ఆండ్రాయిడ్ ఆపరేటింగ్ సిస్టమ్ ఉంటుంది. ఇలాంటి విషయాలను గమనిస్తూ ఫోన్ కొనుగోలు చేస్తే ఎక్కువకాలం మన్నే అవకాశం ఉంది. ఇప్పుడు ఏ ఫోన్ ప్రత్యేకత ఏదో తెలుసుకుందాం.

శామ్‌సంగ్ గెలాక్సీ నోట్ 4

శామ్‌సంగ్ ఎలక్ట్రానిక్ స్మార్ట్‌ఫోన్‌లో అత్యంత ఖరీదైనది 'గెలాక్సీ నోట్ 4'. ధర సింపుల్‌గా 56,000 రూపాయలే. 5.7 అంగుళాల పూర్తి హైడెఫినిషన్ సూపర్ AMOLED టచ్ స్క్రీన్ – 2.3 గిగా హెడ్జ్ క్వాడ్‌కోర్ ప్రాసెసర్. 3200 MAH బ్యాటరీ ఉంటుంది. లేటెస్ట్ ఆండ్రాయిడ్ 4.4.4 కిట్‌క్యాట్ ప్లాట్‌ఫామ్ మీద పనిచేసే ఈ స్మార్ట్‌ఫోన్‌కు 32 జీబీ మెమరీ ఉంటుంది. అదనంగా 64 జీబీ మెమరీని కలుపుకోవచ్చు. 'గెలాక్సీ నోట్ 3' కంటే ఇందులో కొంచెం ఎక్కువ ఫీచర్స్ వుంటాయి. 2జీ, 3జీ, 4జీ నెట్‌వర్క్‌ల మీద ఈ ఫోన్ పనిచేస్తుంది. ఆధునీకరించిన 'ఫైండ్ మై మొబైల్ (Find my mobile) ఫీచర్ ఈ ఫోన్ ప్రత్యేకత. ఈ ఫోన్ పోయినా, లేదా ఎవరైనా దొంగిలించినా ఫోన్‌లోని డేటాను ఎవరూ చూడకుండా ఫోన్ పని చేయకుండా చేసే అవకాశం కొనుక్కున్న వారికి ఉంటుంది. తక్కువ కాంతిలో కూడా చక్కని ఫొటోలు తీసుకునే 16 మెగా పిక్సెల్ కెమెరా దీని ప్రత్యేకత. కేవలం 30 నిమిషాలలో 0 నుంచి 50 శాతం వరకూ ఛార్జింగ్ అయ్యే బ్యాటరీ ఉంది. బ్యాటరీ బ్యాక్‌అప్ కూడా బాగుంటుంది. పవర్ సేవింగ్ ఆప్షన్ కూడా ఇందులో ఉంది.

సోని ఎక్స్‌పీరియా 73

సోనీ కంపెనీ ఎక్స్‌పీరియా మోడల్‌తో స్మార్ట్ ఫోన్‌ను మార్కెట్‌లోకి విడుదల చేసింది. ఈ ఫోన్ బ్లాక్, వైట్, కాపర్ లేదా సిల్వర్ స్క్రీన్ కలర్స్‌తో బ్యాక్ ప్యానల్ ఉండి చుట్టూ అల్యూమినియం ఫ్రేమ్ ఉంటుంది. బటన్స్ కూడా అల్యూమినియంతో చేసినవే. 5.2 అంగుళల స్క్రీన్ సైజు ఉన్న 1080 పిక్సెల్ డిస్‌ప్లే కలిగి ఉంటుంది. బ్యాటరీ బ్యాక్‌అప్ వినియోగదారునికి సంతృప్తికరంగా ఉంటుంది. ఒక్కసారి బ్యాటరీని ఫుల్‌గా ఛార్జింగ్ పెట్టుకుంటే రెండు రోజులు వస్తుంది. ఆండ్రాయిడ్ 4.4.4 కిట్‌క్యాట్ ప్లాట్‌ఫామ్‌పై పనిచేసే ఈ ఫోన్ 801 స్నాప్ డ్రాగన్ ప్రాసెసర్, 2.5 గిగా హెడ్జ్ క్వాడ్‌కోర్ సీపియా, 3జిబీ ర్యామ్, 4జి ఎల్టీఈ, 20.7 మెగా పిక్సెల్ రీయర్ కెమెరా, 25 ఎంఎంవైడ్ యాంగిల్ లెన్స్, 2600_MAH బ్యాటరీ వంటి ప్రత్యేకతలున్నాయి. ఈ ఫోన్‌లో ఉన్న మరో ప్రత్యేకత వాటర్‌ప్రూఫ్. నీళ్లలో పడినా, దుమ్ములో ఉన్నా పాడుకాదు. స్మార్ట్ ఫోన్ అనగానే ముందు గుర్తొచ్చేది యాప్స్ గేమ్స్. గేమింగ్ ప్రియులు ... డిఎస్ 4పై గేమ్స్ ఆడుకోవడానికి ఈ ఫోన్‌ను రిమోట్ స్క్రీన్ ఉపయోగించవచ్చు. ఇక ఫోన్ ధర ఎంతంటారా? 42,900 రూపాయలు.

మోటో జి - 2014

మోటోజి ఫస్ట్ జనరేషన్ తరువాత మరిన్ని ఫీచర్లతో కొత్త వర్షన్‌తో వచ్చిన ఫోన్ మోటోజి 2014. మోటోజి సెకెండ్ జనరేషన్ ఫోన్‌గా వ్యవహరించే ఈ ఫోన్ ఎప్పటిలాగే ఫ్లిప్‌కార్ట్ ద్వారా అమ్మకాలను సాగించింది. మార్కెట్‌లోని పోటీని తట్టుకొని నిలబడటం కోసం మోటొరోలా కంపెనీ ధర తగ్గించి పాతదానిని మెరుగుపరుస్తూ కొత్త హంగులతో కొత్త ఫీచర్లతో ఈ సెకండ్ వర్షన్‌ను మార్కెట్‌లోకి విడుదల చేసింది.

ఫీచర్ల గురించి చెప్పుకోవాల్సి వస్తే... 5 అంగుళాల 720 పి డిస్‌ప్లే వుంటుంది. మెటల్ ఫ్రేమ్, 1.2 గిగా హెడ్జ్ క్యాడ్‌కోర్ ప్రాసెసర్, 16 జిబి మెమరీ 32 జిబి ఎక్స్‌పెండబుల్, 1జిబి ర్యామ్, 8 మెగా పిక్సెల్ రియర్ డ్యుయల్‌లెడ్ రింగ్ ఫ్లాష్ కెమెరా, 2 మెగా పిక్సెల్ ఫ్రంట్ కెమెరా వున్నాయి. విశేషం ఏమంటే... మోటో జిని బడ్జెట్ ఫోన్ అంటారు. ధర రూ. 12,999. బరువు తక్కువగా వుంటుంది. బడ్జెట్ స్మార్ట్‌ఫోన్ కావాలనుకున్నవారు దీన్ని కొనవచ్చు. అయితే... 'లెనోవా మోటోరోలాను కొనుగోలు చేయడం వలన ఫీచర్స్‌లో అప్‌గ్రేడ్ ఉండవు' అనుకుంటే మాత్రం ఈ ఫోన్‌ని కొనకూడదు.

మోటో X

మోటో X–2014. అత్యంత ఆకర్షణీయమైన డిజైన్, కర్వ్‌డ్ (curved) బ్యాక్, మెటల్ ఫ్రేమ్ ఉండటమే కాకుండా మనకు నచ్చిన విధంగా కూడా బ్యాక్ ప్యానల్‌ను ఎంచుకునే వీలుంది. అనేక రంగుల లెదర్ బ్యాక్ ప్యానల్ కానీ, వుడ్ ఫినిషింగ్ ప్యానల్ కానీ ఎంపిక చేసుకోవాల్సింది వినియోగదారుడే. 5.2 అంగుళాలతో 1080 పి డిస్‌ప్లేతో ఆకట్టుకునే విధంగా ఈ ఫోన్‌ను డిజైన్ చేశారు. 13 మెగా పిక్సెల్ రియర్ డ్యుయల్ లెడ్ రింగ్ ఫ్లాష్ కెమెరా ఉంటుంది. ఈ కెమెరా డిజైన్ ఇంతకుముందు ఏ మొబైల్ ఫోన్‌కి లేదు. 4కె వీడియో రికార్డింగ్ సామర్థ్యం ఉంటుంది. 2 మెగా పిక్సెల్ ఫ్రంట్ కెమెరా, 2.5 గిగా హెడ్జ్‌క్వాడ్ కోర్ ప్రాసెసర్, 2జిబి ర్యామ్, 'ప్యూరేస్ట్ ఆండ్రాయిడ్' 4.4.4 కిట్‌క్యాట్ ఓ.ఎస్‌వర్షన్‌తో మోటోX– 2010 అందుబాటులో ఉంది. మోటోవాయిస్ అనే సాఫ్ట్‌వేర్ దీనిలో ఉండటం వలన మన మాటకు స్పందిస్తూ ... మనం ఏదైతే వెతుకుతున్నామో (సెర్చ్) దానికి అనుగుణంగా స్పందిస్తుంది. దానికి ఎలాంటి టచ్ అవసరం లేదు.

ఫోన్ ధర రూ. 33,900/–.

నోకియా లుమియా 530 డ్యుయల్ సిమ్

నోకియా తాజాగా లుమియా 530 డ్యుయల్ సిమ్ పేరుతో చవగ్గా విండోస్ 8ఫోన్ తీసుకొచ్చింది. ఫీచర్స్ అంటరా! విండోస్ ఫోన్ 8.1 ఆపరేటింగ్ సిస్టమ్ వుంటుంది. డ్యుయల్ సిమ్ కనెక్టివిటి, 4 అంగుళాల డిస్‌ప్లే, 1.2 గిగాహెడ్జ్ డ్యుయల్ కోర్, అడ్రినో 302 గ్రాఫిక్ ప్రాసెసింగ్ యూనిట్, 512 ఎంబి ర్యామ్, 5 మెగా పిక్సెల్స్ రియర్ కెమెరా, 4జిబి ఇంటర్నల్ మెమరీ, ఫోన్ కనెక్టివిటి ఫీచర్లు (3జి, వైఫై, బ్లూటూత్) వున్నాయి. ఇక ముఖ్యమైన విషయం ధర కదా. 6,500 రూపాయలు. తక్కువ ధరలో నోకియా ఫోన్ మంచి క్వాలిటీ కావాలంటే ఈ ఫోన్ కొనవచ్చు.

ఎల్‌జి జి3

5.5 అంగుళాల డిస్‌ప్లేతో ఎల్‌జి జి3 మార్కెట్‌లోకి వచ్చింది. 27 ఇన్ ఐమ్యాక్ అండ్ 538 పిపిఐ పిక్సెల్ డెన్సిటీతో ఆకర్షిస్తుంది. 13 మెగా పిక్సెల్స్ లేజర్ గైడెడ్ కెమెరా దీని ప్రత్యేకత. ఇక వీడియోల సంగతి సరేసరి. 16 జిబి స్టోరేజ్ వుంటుంది. బ్యాక్ బటన్స్ కూడా శక్తిమంతంగా వుంటాయి. ప్లాస్టిక్ బాడీతో చాలా ఆకర్షణీయంగా వుంటుంది. 4.4.4 కిట్‌క్యాట్ వర్షన్ ప్లాట్‌ఫామ్ మీద ఇది పనిచేస్తుంది. ధర రూ. 39,490. మంచి బ్యాటరీ బ్యాక్‌అప్‌తో పెద్ద ఫోన్ కావాలంటే ఈ ఫోన్ కొనవచ్చు. చిన్న సైజ్ ఫోన్ కావాలంటే ఈ ఫోన్ కొనకూడదు.

ఐఫోన్ 6- ఐఫోన్ 6 ప్లస్

ఐఫోన్ 6– ఐఫోన్ 6 ప్లస్ ... ఇప్పటికే మార్కెట్‌లో వచ్చినప్పటికీ భారత్‌లో మాత్రం ఈనెల 17 నుంచి అందుబాటులో ఉంచుతున్నట్లు ఆ సంస్థ భారతీయ విభాగం ప్రకటించింది. ఇక దీని ప్రత్యేకతలెన్నో . గత మోడళ్లకంటే ఈ ఐఫోన్ 6– ఐఫోన్ 6 ప్లస్‌లో ఎన్నో ప్రత్యేకతలున్నట్లు కంపెనీ ప్రకటించింది. పూర్తిగా అప్‌డేట్ చేసిన ఐఒఎస్8 ఆపరేటింగ్ సిస్టమ్‌ను ఇందులో వినియోగించారు. దీనితోపాటు 2 ఫోన్లలోనూ రెటీనా హెచ్‌డి స్క్రీన్‌ను అమర్చారు. రెండు ఫోన్లలోను 'A8-64 Bit' చిప్ ఆధారంగా పని చేయనున్నాయి. ఇది గతంలో విడుదల చేసిన 'A7 చిప్ ' కంటే చిన్నది. అంతేకాకుండా ఎక్కువ వేగంతో పనిచేస్తుంది. 8 మెగా పిక్సెల్ కెమెరా రెండు ఫోన్లకు రియాలిటీగా అందిస్తుంది. రెండు ఫోన్ల కోసం కొత్తగా 1.3 మిలియన్ల ఆప్స్ యాపిల్ కంపెనీ సిద్ధం చేసింది. ఏ కలర్ ఫోన్ కావాలో సెలెక్ట్ చేసుకోవాల్సింది వినియోగదారుడే.

ఐఫోన్ 6- ఐ ఫోన్ 6 ప్లస్ మధ్య తేడాలు : రెండు ఫోన్లు టెక్నాలజీ పరంగా ఒకేలా ఉన్నా కొన్ని తేడాలున్నాయి. ఐఫోన్ 6 స్క్రీన్ పొడవు 4.7 అంగుళాలుంటే... అదే ఐఫోన్ 6 ప్లస్‌కి వచ్చేసరికి 5.5 అంగుళాలుగా ఉంది. వెడల్పులో కూడా ఐఫోన్ 6.68ఎంఎం... ఐఫోన్ 6ప్లస్7.1 ఎంఎం మందం ఉంది. కెమెరాలకు సంబంధించి ఐఫోన్6లో డిజిటల్ ఇమేజ్ స్టెబిలైజేషన్ ఉండగా... ఐఫోన్ 6 ప్లస్‌లో ఆప్టికల్ ఇమేజ్ స్టెబిలైజేషన్ ఉంది. దీంతోపాటు టాక్ టైం కూడా తేడా ఉంది. ఐఫోన్ 6 ప్లస్ 3జీ కాల్స్ మాట్లాడితే గరిష్ఠంగా 24 గంటల టాక్‌టైమ్ ఉంటుంది. అదే ఐఫోన్ 6లోనైతే కేవలం 14 గంటల 3 జీ టాక్ టైం ఉంటుంది. ఐ ఫోన్ 6 ధర – రూ. 50,000/-. ఐఫోన్ 6 ప్లస్ ధర – రూ. 62,000/-.

ఐఫోన్ 6+ బెండ్ అవుతుంది. ఎలాంటి డ్రాబ్యాక్స్‌లేని స్మార్ట్‌ఫోన్ కావాలంటే ఐఫోన్6 కొనవచ్చు. ధర ఎక్కువ కాబట్టి కొనేముందు ఆలోచించాలి.

మైక్రోమాక్స్ కాన్వాస్ ఎ1 ఆండ్రాయిడ్ వన్ మొబైల్

ఇంటర్నెట్ సెర్జింజన్ సంస్థ గూగుల్ తన స్మార్ట్ ఫోన్ గూగుల్ ఆండ్రాయిడ్ వన్ మొబైల్ ఫోన్‌ను మార్కెట్‌లోకి విడుదల చేసింది. ప్రపంచ వ్యాప్తంగా తొలిసారిగా మన దేశంలోనే విడుదల చేశారు. ఈ ఫోన్లను అమెజాన్, ఫ్లిప్‌కార్ట్, స్నాప్‌డీల్ వంటి ఆన్‌లైన్ సంస్థల ద్వారా కొనుగోలు చేయవచ్చు. ఫీచర్ల విషయానికొస్తే... 4.5 ఇంచుల స్క్రీన్, 1జిబి ర్యామ్, 4జిబి ఇంటర్నల్ మెమరి, 32జిబి ఎక్స్‌పాండబుల్ మెమరీ, 5మెగా పిక్సెల్ రియర్ కెమెరా, 2 మెగా పిక్సెల్ ఫ్రంట్ కెమెరా దీని ప్రత్యేకత. ధర రూ. 6,499/-.

హెచ్‌టిసి డిజైర్ 616

మధ్యస్థంగా ధర పెట్టగలిగే వారిని ఆకర్షించడమే లక్ష్యంగా దీనిని డిజైన్ చేయడం జరిగింది. ఫీచర్స్ గురించి చెప్పుకుంటే... 5 అంగుళాల టచ్ స్క్రీన్‌తో 720 పిక్సెల్ రెజల్యూషన్, 8 మెగా పిక్సెల్ రియర్ కెమెరా, 2 మెగా పిక్సెల్ ఫ్రంట్ కెమెరా, డ్యుయల్ సిమ్, 3జి సపోర్ట్, వై-ఫై, బ్లూటూత్. ధర రూ. 15,498/-.

రెడిమి 1ఎస్

జియామీ మరో బడ్జెట్ స్మార్ట్‌ఫోన్ రెడ్‌మి 1ఎస్. తక్కువ ధరలతో దొరికే స్మార్ట్ ఫోన్లలో రెడ్‌మి1ఎస్ ప్రస్తుతం మొదటిస్థానంలో ఉంది. హార్డ్‌వేర్, సాఫ్ట్‌వేర్ పరంగా రెడ్‌మి1ఎస్ బావుంటుందంటారు. ఫీచర్లు... డ్యూయల్ సిమ్‌ఫోన్, 4.7 అంగుళాల 720పి డిస్‌ప్లే, 1.6జిహెచ్‌జెడ్ క్వాడ్‌కోర్, 1 జిబి ర్యామ్, 8 జిబి మెమరీ – 32జిబి ఎక్స్‌పాండబుల్, 8 మెగా పిక్సెల్స్ రియర్ కెమెరా, 1.3మెగా పిక్సెల్స్ ఫ్రంట్ కెమెరా.

ధర రూ. 5,999. ఆండ్రాయిడ్ 4.3 డిఎస్‌తో వస్తుంది. పెద్ద డిస్‌ప్లే ఫోన్ కోరుకునేవారికి ఇది నచ్చుతుంది.

నోకియా లూమియా 830



మైక్రోసాఫ్ట్ కంపెనీ డ్యూయల్ సిమ్ స్మార్ట్ ఫోన్ లూమియా 830 మార్కెట్లోకి విడుదల చేసింది. దీని ప్రత్యేకతలు...విండోస్ ఫోన్ 8.1 వర్షన్, 5 అంగుళాల 720పి డిస్‌ప్లే, 1జిబి ర్యామ్, 16 జిబి ఇంటర్నల్ మెమెరీ – 128 జిబి ఎక్స్‌పాండబుల్, 10 మెగా పిక్సెల్ కెమెరా, ఫ్యాష్ సరిచేసుకోగలిగిన సౌకర్యం కూడా ఉంది. ఇది ఒకరకంగా బడ్జెట్ ఫోన్. కర్వ్‌డ్ బ్యాక్ ప్యానల్‌తో ఆరెంజ్, గ్రీన్, గ్రే, వైట్ కలర్స్‌తో అల్యూమినియం బ్యాండ్‌తో గుండ్రటి ఫ్రేమ్ కలిగి ఉంటుంది. నోకియాలో మంచి క్వాలిటీ కొనాలంటే ఈ ఫోన్ మంచిది. విండోస్ యాప్స్ ఇబ్బంది అనుకుంటే ఈ ఫోన్ కొనకూడదు.

ఎమ్ ఐ 3

మధ్యతరగతి వారి ఐఫోన్ కలను నిజం చేసే ఈ జియామీ MI3 ఫోన్. చైనా వారి ఐఫోన్‌గా అనుకోవచ్చు. ఈ జియామీ MI3 ఫోన్ ప్రీమియం బడ్జెట్‌తో భారత్‌లో విడుదల చేసింది. ఇది ఫ్లిప్‌కార్డ్ ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంది. అల్యూమినియం మెగ్నీషియం ఫ్రేమ్‌కు ట్రిలేయం థర్మల్ గ్రాఫైట్ కోటింగ్‌తో ఆకర్షణీయంగా ఉంటుంది. ఫీచర్స్ చెప్పుకోకపోతే ఎలా? 5 అంగుళాల ఫుల్ హెచ్‌డి ఐపిఎస్ డిస్‌ప్లే, యాంటీ గ్లేయర్ కోటింగ్ (స్క్రీన్ మీద వేలిముద్రలు పడకుండా), వైడ్ వ్యూయింగ్ (పక్కనుంచి కూడా కనిపిస్తుంది), 13 మెగా పిక్సెల్ డ్యుయల్ ఎల్ఈడి కెమెరా దీని సొంతం. ధర: రూ. 13,900 /– తక్కువ బడ్జెట్‌లో ప్రీమియం ఫోన్ కొనాలంటే ఈ ఫోన్ కొనవచ్చు. ఆన్‌లైన్‌లో మాత్రమే అందుబాటులో ఉన్నాయి. బయట మార్కెట్‌లో అందుబాటులో లేవు.

మైక్రోమ్యాక్స్ కెన్వాస్ నైట్రో

మైక్రోమ్యాక్స్ మార్కెట్‌లోకి విడుదల చేసిన సరికొత్త మొబైల్. చూడటానికి చాలా అందంగా ఆకర్షణీయంగా ఉంటుంది. లెదర్ బ్యాక్ ప్యానల్ ఉంటుంది. ఫీచర్స్ చూస్తే... 2జిబి ర్యామ్, 5 అంగుళాల హెచ్‌డి ఐపిఎస్ డిస్‌ప్లే, 13 మెగా పిక్సెల్స్ ఆటో ఫోకస్‌తో రియర్ కెమెరాతో హెడివిడియో రికార్డింగ్ సామర్థ్యం, 5 మెగా పిక్సెల్స్ ఫ్రంట్ కెమెరా, 8 జిబి మెమరీ, 32 జిబి ఎక్స్‌పాండబుల్ రామ్. ఇక ధర : రూ. 11,589/–.

అసుస్ జన్ ఫోన్ 5

కంప్యూటర్ మదర్‌బోర్డులు తయారుచేసే అసుస్ కంపెనీ మొబైల్ తయారీ రంగంలో కూడా తనదైన ముద్ర వేసుకుంది. మెటల్ బాడీ కలిగి ఆకర్షణీయంగా తయారుచేశారు. ఫీచర్స్ చూస్తే... 5 అంగుళాల ఐపిఎస్ హెచ్‌డి క్రోర్నింగ్ గొర్గిల్లా గ్లాస్ 3 డిస్‌ప్లే, 1.6 డ్యుయల్‌కోర్ ఇంటెల్ ప్రాసెసర్, 8 జిబి, 16 జిబి మెమరీ, 2జిబి ర్యామ్, 8 మెగా పిక్సెల్ రియర్ కెమెరా, 2 మెగా పిక్సెల్ ఫ్రంట్ కెమెరా వున్నాయి. 8 జిబి ధర: రూ. 9,999/–, 16 జిబి ధర : రూ. 12,999/–. ఫ్లిప్ కార్డ్‌లో ప్రస్తుతం అందుబాటులో ఉంది.

ఇ3

సోనీ ఎక్స్‌పిరియా ఇ3 ప్రత్యేకతలు... అల్యూమినియం బటన్స్, రబ్బర్ కార్నర్స్ ఉండటం వలన రక్షణ ఉంటుంది. నలుపు, తెలుపు, పసుపు రంగుల్లో దొరుకుతుంది. 4.5 అంగుళాల టెంపర్డ్ గ్లాస్ డిస్‌ప్లే ఉండటం వలన మరకలు, గీతలు పడవు. 5 మెగా పిక్సెల్స్ రియర్ కెమెరా, 1.3 మెగా పిక్సెల్ ఫ్రంట్ కెమెరా, హెచ్‌డి రికార్డింగ్ సామర్థ్యం, 4.4.4 ఆండ్రాయిడ్ కిట్‌క్యాట్, సింగిల్స్ సిమ్ అండ్ డ్యుయెల్ సిమ్ సౌకర్యం ఉంది. సింగిల్ సిమ్ ధర : రూ. 11,490, డ్యూయల్ సిమ్ ధర :రూ. 12,050/–.

★

◆ కథ

ప్రేమేరా అన్నిటికీ మూలం

స్వాతి శ్రీపాద

▪ ఫోన్: 8297248988

లంచ్ టైం.... బెల్ అవుతూనే గబగబా పుస్తకాలు పక్కకి జరిపి లంచ్ కోసం ఒక పెద్ద డ్రాయింగ్ షీట్ పరచి, బల్లకటు వైపూ ఇటువైపూ కూచుని సుజన, రమణి, నేనూ, శైలజ కోసం ఎదురు చూస్తున్నాం. శైలజ బహుశా పదో తరగతిలో ఉండి ఉంటుంది, అంతవరకూ లేని సందేహాలు పిల్లలకు బెల్ అవగానే వచ్చేసి చుట్టూ మూగుతారు, వచ్చేస్తుంది.

రెండు మూడు నిమిషాల్లో. అదిగో మాటలోనే వచ్చేసింది. చాక్ పీస్‌లు టేబుల్ మీద వేసి సింక్ వైపు చేతులు కడుక్కుందుకు వెళ్తూ వెయిటింగా 'స్టార్ట్ చెయ్యండి వస్తున్నా' అంది మావైపు చూసి. ఆ మాటకే ఎదురు చూస్తున్నట్టు మేమంతా మా లంచ్ బాక్స్ లు తెరిచి షేరింగ్ మొదలెట్టాం. సుజన గుత్తి వంకాయ, రమణి గోరుచిక్కుడు, నేను తెచ్చిన పాలక్ పన్నీర్ పంచుకునే సరికి వచ్చింది శైలజ. బ్యాగ్ లోంచి రెండు డబ్బాలు తీసి బల్లమీదుంచి ఒకడబ్బా మూత తెరిచింది.

అన్నం అది, అదలాగే పక్కనుంచి రెండో డబ్బా అందుకుంటూ ఇంత తేలిగ్గా ఉందేమిటి? అంటూనే తెరిస్తే ఏముంది ఖాళీ. 'అయ్యో మర్చిపోయినట్టున్నాను' అంటూ నొచ్చుకుంది.. పోనీ మేమంతా తెచ్చాంగా అప్పటికి షేర్ చేసుకుని లంచ్ ముగించినా శైలజ తీరు చూస్తే అన్యమనస్కంగానే ఉన్నట్టనిపించింది. ఏదైనా చెప్పదలుచుకుంటే తనే చెప్పాలిగాని పదిసార్లు తరచితరచి అడగటం బాగుండదని పించింది. లంచ్ తరువాత ఎవరిక్లాస్‌లు వాళ్ళకున్నాయి. మూడున్నర అవుతూనే లాంగ్ బెల్ కోసం ఎదురు చూసే చాలా మంది అప్పటికే బ్యాగ్‌లు సర్దుకుని గేట్ దగ్గరున్నారు బెల్ అవుతూనే జంప్ చేసేందుకు. లాస్ట్ పీరియడ్ క్లాస్ ఐదునిమిషాలు ఆలస్యంగా వదిలి స్టాఫ్ రూమ్‌కి వచ్చేసరికే అందరూ ఎవరి దారిన వాళ్ళు వెళ్ళిపోయారు.

శైలజ బల్లమీద తలవాల్చి కళ్ళు మూసుకుని ఉంది. చేతులు కడుక్కుని నాప్‌కిన్ తో తుడుచుకుంటూ అడిగాను, 'వంట్లో బాలేదా శైలూ' అని. 'అబ్బే, అయాం ఓకె, ఏమిటో ఇంటికి వెళ్ళాలని అనిపించడం లేదు'. తల పైకెత్తి టేబుల్ మీద పుస్తకాలు అటూ ఇటూ జరుపుతూ అంది. పోనీ నాతో పాటు రా, మా ఇంటికి వెళ్దాం. పద అంటూ తటపటాయిస్తున్న తనని ఒకరకంగా లేవదీసి నా వెంట బయలుదేర దీశాను.

అదేమిటో మా స్కూళ్ళన్నీ సిటీకి చివర్లలోనే ఉన్నాయి, బహుశా వాటికి అవసరమైన ప్లే గ్రౌండ్ అదీ అక్కడే దొరికిందేమో. నేను ఒక ఆటో మాట్లాడేసుకున్నాను, బస్‌లలో వేళ్ళాడి వెళ్ళి వచ్చే ఓపికలేక. ఆటోలో మరొకరు కూడా ఉండటంతో ఇద్దరం పెద్దగా మాట్లాడుకోలేదు.

నేను తలుపు తీసుకుని ఇంట్లో అడుగు పెడుతూ 'రా శైలూ' అని శైలజకు స్వాగతం పలికి లోపలకి వెళ్ళేసరికి అత్తగారు హాల్లో కూచుని టీవీ చూస్తున్నారు. ఇద్దరినీ ఒకరికొకరికి పరిచయం చేసి 'ఒక్క నిమిషం శైలూ, అత్తగారికి కాఫీ ఇచ్చేస్తే... అప్పుడు మనం ఫ్రీ నే' అంటూ తనను కూర్చోమని నేను వంటగదిలోకి వెళ్లాను. అయినా హాల్లోంచి వాళ్ళిద్దరి మాటలు వినిపిస్తూనే వున్నాయి.

'ఎక్కడ ఉంటారమ్మాయ్?' తో మొదలై పిల్లలు, ఇంటి పేరు, వూరు ఇలా అత్తగారి ప్రశ్నల పరంపర సాగుతూనే ఉంది. నవ్వుకున్నాను. శైలజ బెరుకు బెరుగ్గా జవాబులిస్తోంది. కాఫీలు ప్లేట్లో జంతికలు పెట్టుకుని వారి మధ్యకు వచ్చాను. అత్తగారు టీవీ ఆఫ్ చేసేసి, తన గ్లాస్ పళ్ళెం పట్టుకుని లేచారు.

'మీరిక్కడ కూచున్నా ఇబ్బందేమీలేదు అత్తయ్యా' అన్నాను. ఆవిడ నవ్వి 'ఎందుకమ్మా మీరు మాట్లాడుకోండి, నేను నా గదిలోకి వెళ్తాను, అక్కడే కాస్సేపు టీవీ చూస్తాను' అంటూ తన గది వైపు

“ సుమతీ! ఇంట్లో మీ ఇద్దరే ఉంటారు కదా ఇద్దరిమధ్య గొడవలేం ఉండవా? అసలు ...' అంటుండగా మధ్యలోనే ఆపేశాను శైలజను. 'లేదు శైలూ, మా పెళ్ళి వచ్చేసరికి ఆవిడ వయసు నలభై రెండేళ్ళు. పద్నాలుగేళ్ళకి పెళ్లి చేసారట. కాపురానికి వస్తూనే నెల తప్పటం, మరో రెండు నెలలకే ఆయన హఠాత్తుగా పాము కరిచి పోవడం జరిగిపోయింది. మా ఆయన కళ్ళు విప్పేసరికే కన్నతండ్రి లేడు. తమ వంతుకి వచ్చిన రెండెకరాల పొలం మీద రాబడితో పుట్టిల్లు చేరక తమ్ముడింటి పక్కనే చిన్న ఇల్లు కొనుక్కుని పొదుపుగా బతుకుతూ కొడుకుని చదివించుకున్నారు. ఆయనకు ఉద్యోగం వస్తూనే మా పెళ్ళి జరిగింది. నాకు ఆవిడలో ఒక అత్తగారు కనిపించదు. ఒక స్త్రీ కనిపిస్తుంది. ”

కదిలారు.

నేనూ శైలజ పైన ఉన్న నా గదికి వెళ్తూ 'పెద్ద వాళ్ళుగదా, ఏదో ఒకటి మాట్లాడాలి, వాళ్ళ పరిధిలో వాళ్లకు తెలిసినది, తెలిసినవే అడుగుతారు, దాని వల్ల పెద్ద వాళ్లకు వచ్చేదీ, పోయేదీ ఏదీ ఉండదు, జస్ట్ కాలక్షేపం కబుర్లు' అన్నాను వివరిస్తున్నట్టు.

లోపలి వెళ్లి తీరిగ్గా కూచున్నాక, ఉన్నట్టుండి, 'నీకు ఈవిడ ఇలా అడగటం ఇబ్బందిగా ఉండదా సుమతీ! ఇంట్లో మీ ఇద్దరే ఉంటారు కదా ఇద్దరిమధ్య గొడవలేం ఉండవా? అసలు ...' అంటుండగా మధ్యలోనే ఆపేశాను శైలజను. 'లేదు శైలూ, మా పెళ్ళి వచ్చేసరికి ఆవిడ వయసు నలభై రెండేళ్ళు. పద్నాలుగేళ్ళకి పెళ్లి చేసారట. కాపురానికి వస్తూనే నెల తప్పటం, మరో రెండు నెలలకే ఆయన హఠాత్తుగా పాము కరిచి పోవడం జరిగిపోయింది. మా ఆయన కళ్ళు విప్పేసరికే కన్నతండ్రి లేదు. తమ వంతుకి వచ్చిన రెండెకరాల పొలం మీద రాబడితో పుట్టిల్లు చేరక తమ్ముడింటి పక్కనే చిన్న ఇల్లు కొనుక్కుని పొదుపుగా బతుకుతూ కొడుకుని చదివించుకున్నారు. ఆయనకు ఉద్యోగం వస్తూనే మా పెళ్ళి జరిగింది. నాకు ఆవిడలో ఒక అత్తగారు కనిపించదు. ఒక స్త్రీ కనిపిస్తుంది. ఆత్మ స్థైర్యంతో కొడుకుని ప్రయోజకుడిని చేసిన ఒక అమ్మ కనిపిస్తుంది. జీవితమంతా బాధపడిన ఒక అభాగ్యురాలు కనిపిస్తుంది. అన్ని బాధలు పడినా పెళ్ళి చేసిన మరుక్షణం నుండి నన్ను కూతురిగానే స్వీకరించారు. కొడుకు సుఖంగా ఉండాలంటే కోడలు ఆనందంగా ఉండాలని నాతోనే చాలా సార్లు అనేవారు. ఇహ అభిప్రాయభేదాలు అంటావా? కొన్నిటికి నేను రాజీ పడితే కొన్ని ఆవిడ రాజీ పడతారు. ఏ ఇద్దరు మనుషుల అభిరుచులూ ఒక్కలా ఉండవుగా. పుట్టిన ప్రతి క్షణం నుండీ ఎన్నింటి తోనో రాజీ పడతాం, సజీవాలతో నిర్జీవాలతో, అలాంటిది మనకు కావలసిన వాళ్ళతో రాజీ పడలేమా?'

'అనుకోడం సులభమే...' అప్రయత్నంగానే అంది శైలజ. 'అవును శైలజా, ఇవ్వాళ చెప్పినంత సులభం కాదు. ఇంత అనుబంధం పెంచుకునేందుకు ఇప్పుడు చెప్తే అదో సినిమా కథలా అనిపిస్తుంది, కాని కంటికి కనిపించకుండా రోజురోజుకీ మొక్క పెరిగినట్టు పెరగడానికి దానికి కావలసిన పోషకాలు దానికి కావాలి. రోజురోజుకీ బలపడటానికి ప్రేమ ఆప్యాయతలు, ఒకరినొకరు అర్థం చేసుకోవడం...' అని చెప్పుండగానే 'సుమతీ! మా పెళ్లై పదహారేళ్ళు. నేనెంత ఆత్మీయంగా ఉందామని చూస్తానో నన్నంత శత్రువులా చూస్తారు మా అత్తింటి వారు. నేనేం చేసినా నచ్చదు మా అత్తగారికి. చివరికి ఆవిడ వంట ఆవిడ చేసుకునే వరకూ వచ్చింది. అయినా కొడుకు ఇంట్లో ఉన్నంత సేపూ ఒక రకమైన నటనలో ఎక్కడి లేని ప్రేమలూ ఒలక బోసి ఆయన అటు వెళ్తూనే చూపులో మాటలో తేడా వచ్చేస్తుంది. నేనో ఆగర్భ శత్రువునైనట్టు... ఆయన చెప్పేశారు మా అమ్మ బాధ్యత నాది. సో మీరేమైనా అనుకోండి ఆడుకోండి. ఆవిడకి ఇష్టమైనన్నాళ్ళు ఇక్కడే ఉంటుంది. నేను ఎవరి విషయం లోనూ తలదూర్చనని అని. పిల్లలతోనూ అంతే. ఏది కావాలన్నా మీ అమ్మ నడగండి. అంటీ ముట్టనట్టు. పెళ్ళికి ముందు ఒక మంచి కుటుంబం కావాలనుకున్నాను, ఆ ఇంట్లో నేను అందరినీ నావాళ్ళని అనుకోవాలనీ, చేసుకోవాలనీ ఎన్నో కలలు కన్నాను. కాని పెళ్లి రోజునుండే మొదలు ఎడమొహం పెడ మొహం. మా వాళ్ళు కొన్న చీర రంగు నచ్చలేదనీ, ముగ్గురికీ వంట చేసే అన్నం బిరుసుగా వండావని ఈవిడా, మెత్తబడితే ఇది అన్నమా సంకటి ముద్దా అని ఆయన. ఎక్కువ వండితే కిందా మీదా చూసుకోకుండా వండి పారేస్తానని, అలాగని తక్కువ వండితే కావాలనే తక్కువ వండావు గిన్నెలు చూసుకుంటూ తినాలా అని...మొత్తానికి ఎదురు చెప్పలేక, విని భరించలేక నలిగిపోతున్నాను. ఏ పని చేసినా తప్పే చెయ్యక పోయినా తప్పే. చివరికి ఇల్లు వదిలేసి ఎక్కడికైనా పారిపోదామనిపిస్తోంది....' శైలజ స్వరం బొంగురు పోయింది.

'అలా అనుకుంటే ఎలా శైలూ ...కొంచెం రిలాక్సవు ..ఇవన్నీ నేనూ అనుభవించాను. ఈ మాటలు ఈ ప్రవర్తనా అర్థం చేసుకుంటే సరిదిద్దడం చాలా సులభం. పెళ్లి చేసుకుని అత్తవారింట అడుగిడే కొత్త కోడలికి ఎన్ని భయాలు బెరుకులు ఉంటాయో, అంతకన్నా ఎక్కువ ఆ అబ్బాయి తల్లికీ ఉంటాయి. నిన్నటి వరకూ కొంగు పట్టుకుని వెనక వెనక తిరిగిన కొడుకు హఠాత్తుగా మరో కొంగు నీడకు జారుకోవడం ఎవరికైనా బాధాకరమేగా .. ప్రతి చిన్న విషయం క్రితం రోజు వరకూ తనతో పంచుకున్న కొడుకు నేనూ నా భార్యా మాపిల్లలు అంటూ గిరి గీసుకోవడం చిత్రహింసే. పెళ్లి చేసుకున్న అమ్మాయి నా మొగుడు, నా ఇల్లు, నా అనుకుంటూ వచ్చే బదులు మా అనుకుంటే ఎంత బాగుంటుంది. నిజానికి మొదట్లో నాకూ తెలిసేది కాదు. కాఫీ నేను చేస్తే అత్తగారు అయిష్టంగా తాగడం, ఆవిడ చేస్తే నాకు తియ్యగా పానకంలా అనిపించడం, ఒకసారి ఆయననే అడిగాను ఎలా ఈ సమస్యకు పరిష్కారమని. 'అదేదో తడిక వ్యవహారంలా కాక అమ్మనే అడిగేయ్యొచ్చుగా'. జీవితమంతా కలసి ఉంటారు మీ ఇద్దరే మాట్లాడుకోవాలి. అదొక్కటే ఆయన నాకు చెప్పిన మాట. ఇంత చిన్న విషయం నాకెందుకు తట్టలేదా అని నాలుక కరుచుకున్నాను. మర్నాడు ఉదయం అత్తగారు కాఫీ చెయ్యడం గమనించాను. సగం డికాషన్ సగం వేడి చేసిన పాలు కలిపి గ్లాస్ కి మూడు చెంచాల పంచదార వెయ్యడం ఆవిడ వేసుకున్నాక, అత్తగారూ నాక్కొంచం తక్కువ. సగం వెయ్యండి చాలు. కొంచెం కాఫీ తీసేసి రెండు చుక్కలు డికాషన్ వెయ్యండి అంటూ అన్యాపదేశంగా నా అభిరుచిని వ్యక్తం చేశాను. ఆ రోజున ఇద్దరం పెరట్లో కూచుని కాఫీతాగుతూ ఆ పావుగంటా చాలా విషయాలు మాట్లాడుకున్నాము. అది ఇప్పటికీ అలవాటే. ఎంత కొంపలు మునిగే పనులున్నా ఉదయం మా కాఫీ వేళలో కబుర్లు అత్యవసరం. ఒకరి బాధలు, సుఖాలు మరొకరితో పంచుకునేందుకు. ఏమిటోనే అమ్మాయ్, పొద్దున్నే స్నానం చేసి తులిసెమ్మకు రెండు చుక్కలనీళ్లు పోసుకుంటే గాని గోతులో నీటి చుక్క కూడా పోసుకోబుద్ధి

" మూడేళ్ళ క్రితం ఆయన హఠాత్తుగా జబ్బు పడ్డప్పుడు నన్ను కన్నతల్లిలా గుండెల్లో దాచుకున్నారు. మానసికంగా నన్ను ధృఢపరిచారు. వాడి జీవితం ముగిసిపోయింది రా తల్లీ. నువ్వు బాధ పడితే వాడి ఆత్మా క్షోభిస్తుంది. మన జీవితం మనం బతకాలిగా అంటూ ఓదార్చేవారు. ఇవి పాత రోజులు కావు నా కోడలు నిత్య సుమంగళి. దానిలోనే నా కొడుకున్నాడు.. అది ఎప్పటిలానే ఉంటుంది. గాజులు, పూసలు మట్టెలు మంగళ సూత్రాలతో అంటూ అందరి నోళ్ళు మూయించారు. "

కాదు, ఆచారమని కాదుగాని, అలవాటై పోయింది. అంటూ తనకేది ఇష్టమో ఏది యిష్టమో చెప్పేవారు. అయితే నా ఇష్టం ఈవిడేమిటి నన్ను శాసించేది అని నేను అనుకోలేదు. నిన్నటి వరకు ఆ ఇల్లు నడుపుకు వచ్చినది ఆవిడ, ఈ రోజున నాయిష్టం అంటూ ఆవిడను తోసి రాజనటం ఎంత వరకు సబబు. తెల్లారి ఆరింటికల్లా లేవబోతే అప్పుడే ఏం తొందర అంటూ ఆయన గారు గునిసినా ప్రలోభపడలేదు. లేదండి, మళ్ళీ ఆలస్యమయితే అత్తగారు కాఫీ చేసేస్తారు అంటూ లేచి ముందుగా స్నానం చేసి తులిసెమ్మ దగ్గర దీపం పెట్టి ఆవిడ లేచి స్నానం చేసే సరికి కాఫీ గ్లాస్ సిద్ధంగా అందించాను. పెద్ద పొగడ్తలు, ఆకాశానికి ఎత్తెయ్యడం ఆవిడకు రాకపోవచ్చుగాని ఆ చూపులో మెచ్చుకోలు ఎప్పటికీ మర్చిపోలేను. ఇద్దరం పెరట్లో మల్లెతీగ కింద కూచుని కాఫీ తాగుతుంటే, ఓసినీ, అచ్చం నేను చేసినట్టుగానే ఉందే కాఫీ, గొప్ప తెలివైన దానవు సుమా అన్నారు. అలా మొదలైంది మా వంటింటి రాజీ పథకం, నెమ్మది నెమ్మదిగా ఆవిడ కూడా నాకు నచ్చవని పొట్లకాయ బీరకాయ వండితే నాకోసం మరోకూర చెయ్యడం, నాకు ఇష్టమని చిక్కుడు కాయ పులుసూ బెల్లం పెట్టి వండడం మొదలెట్టారు. ఒకటో తారీఖున ఆయన జీతం తెచ్చి నాకివ్వబోయారు. వద్దండి, ఇంట్లో ఉన్నది ముగ్గురం పెద్దావిడ, ఆవిడకే ఇవ్వండి ఆ మాట నాకు సంపాదించి పెట్టిన ప్రేమ ఎన్ని అధికారాలకు సరితూగగలదు. ఆయన ఆవిడతో ఏది చర్చించినా అమ్మాయ్ చెవిన కూడా ఓమాట వేస్తే బావుంటుంది అనే వరకూ వచ్చారు. ఆవిడ ప్రోద్బలంతోనే నేను ఉద్యోగంలో చేరాను. అలాగని అభిప్రాయ భేదాలు రాలేదనీ కాదు. ఇల్లు కట్టుకుందా మన్నప్పుడు ఆవిడ ఎంత వ్యతిరేకించారో... ఉన్న ఇల్లు చాలదా ఇప్పుడు అప్పులు చేసుకుని ఆడంబరాలకు పోవాలా అంటూ ఇల్లు అనుకున్నాక రెండేళ్ళపాటు నచ్చజెప్పాం. ఇద్దరం ఉద్యోగాలు చేస్తున్నాం గనక అదిపెద్ద కష్టం కాక పోవచ్చనీ, అదీ గాక ఇద్దరూ అమ్మాయిలే అవటం వల్ల రేప్పొద్దున వాళ్ళ కార్యక్రమాలకు, నలుగురిని పిలిచినా కూచునేందుకు కూడా చోటు చాలదనీ, ఆవిడకూ పిల్లలకూ ఒక గది అవసరం గురించీ. చెప్పగా చెప్పగా అయిష్టంగానే సరే అన్నాక గాని మేం ముందుకు కదలలేదు.. ఈ ఇల్లు అమ్మేద్దామంటరా? ఈ ప్రశ్న ఆవిడ కొడుకును అడగలేదు నన్నే అడిగింది. వద్దండి ఇది అద్దెకిద్దాం. వీలైనంత వరకు అది అలాగే ఉండనిద్దాం అన్నాను. అది ఆవిడకు పెద్ద ఓదార్పు నిచ్చింది. అంతే కాద. ఇల్లు మేం రిజిస్టర్ చేయించినది ముగ్గరి పేరునా.... నా పేరెందుకు మధ్యలో అన్నారు. కాని 'మీరే ముందు మాకు' అని నచ్చజెప్పాం. దీని వల్ల మేం పోగొట్టుకున్నది ఏమీ లేదు. ఆవిడకు మాత్రం మన అనే ఫీలింగ్ బలంగా నాటుకు పోయింది. పిల్లలను నిజానికి నేను చూసింది చాలా తక్కువ. ఆవిడే అతి జాగ్రత్తగా పెంచి పెద్ద జేశారు. నా పిల్లలు నాయిష్టం అని నేనెప్పుడూ అనుకోలేదు. ఆవిడ వాళ్ళ మంచే కోరతారు గాని చెడు కాదుగా అనుకునే దాన్ని. కొప్పడ్డా కిమ్మనకుండా ఉండే దాన్ని. దాని వల్ల మళ్ళీ ఆవిడే వాళ్ళను దగ్గరకు తీసేవారు. నిజమే అన్ని బాధలూ పడి పెంచిన ఆవిడ ఒకమాటంటే తప్పేమిటి? పిల్లలు కంప్లైయింట్ చేసినా ఆవిడ చెప్పినట్టు వినాలనే చెప్పేదాన్ని. చివరికి ఇద్దరి పెళ్ళిళ్ళు ఆవిడ దక్షత కిందే జరిగిపోయాయి. రెండో దాని పెళ్ళికి ఇబ్బందయితే అడక్కముందే ఆవిడ ఇల్లమ్మి మరీ ఇచ్చారు. మీ ఇల్లు నాదైనప్పుడు నాది మీది కాదా అంటూ. మూడేళ్ళ క్రితం ఆయన హఠాత్తుగా జబ్బు పడ్డప్పుడు నన్ను కన్నతల్లిలా గుండెల్లో దాచుకున్నారు. మానసికంగా నన్ను ధృఢపరిచారు. వాడి జీవితం ముగిసిపోయింది రా తల్లీ. నువ్వు బాధ పడితే వాడి ఆత్మా క్షోభిస్తుంది. మన జీవితం మనం బతకాలిగా అంటూ ఓదార్చేవారు. ఇవి పాత రోజులు కావు నా కోడలు నిత్య సుమంగళి. దానిలోనే నా కొడుకున్నాడు.. అది ఎప్పటిలానే ఉంటుంది. గాజులు, పూసలు మట్టెలు మంగళ సూత్రాలతో అంటూ అందరి నోళ్ళు మూయించారు. చెప్పు శైలూ, మనం ఏదైనా ఇస్తే కదా మనకు తిరిగి వచ్చేది. నేను ఆవిడకు ఈ ఇల్లు తనదనే భావన నిచ్చాను. అది మాకు ఒక పెద్ద మర్రి నీడ కాలేదూ.. సాలోచనగా తలూపింది శైలజ. ఇంకో సంగతి చెప్పనా? నీ కూతుళ్ళకు ఇళ్లూ వాకిళ్ళూ ఉన్నాయి, నేనివ్వాళ ఉంటే రేపు నమ్మికం లేదు, ఎవరైనా తోడూ దొరికితే నిరాకరించకు అని చెప్తారావిడ. చెప్పు శైలూ మనం ఏదైనా మలుచుకోవాలంతే. ముందు మనని మనం చెక్కుకోవాలి. అవును సుమతీ, ఈ రోజు నీతో వచ్చి చాలా మంచిపని చేశాను. అదేదో సినిమాలోలాగా ఇవాళే మారిపోలేనేమో గాని... అసలు నువ్వేవి చెయ్యలేదో అవన్నీ నేను చేశాను. నా మొగుడు నా మాటే వినాలనీ, నా ఇష్టాలు ఎందుకు మార్చుకోవాలనీ... మళ్ళీ టీ తాగాక ఇద్దరికీ చెప్పి బయల్దేరింది శైలజ. మధ్యలో కోటిలో ఆగి పనసపొట్టు కొనడం మర్చిపోలేదు, అత్తగారికి పనసపొట్టు ఆవ పెట్టి వండిన కూర చాలా ఇష్టం మరి.

★

◆కార్టూన్ కదంబం







పీతల స్పెషల్

ఇగురు

కావలసిన పదార్థాలు : పీతలు : 2 (శుభ్రం చేసి 4 ముక్కలుగా కట్ చేసి, కాళ్లను విడిగా ఉంచాలి), అల్లంవెల్లులి పేస్టు : ఒకటిన్నర స్పూను, పసుపు : అర టీ స్పూను, కారం : 2 టీ స్పూన్లు, పచ్చిమిర్చి : 3, కరివేపాకు: 4 రెబ్బలు, కొత్తిమీర తరుగు : గుప్పెడు, ఉప్పు : రుచికి తగినంత, నూనె : 5 టీ స్పూన్లు.

మసాలా కోసం : గసగసాలు ఒకటిన్నర స్పూను, యాలకులు: 2, దాల్చిన చెక్క : అంగుళం ముక్క, జీలకర్ర: 1 టీస్పూను, లవంగాలు : 3, ధనియాలు : 2 టీ స్పూన్లు, ఉల్లిపాయలు : 4, (అన్నీ ముద్దగా నూరిపెట్టుకోవాలి).

తయారుచేసే విధానం : నూనెలో పచ్చిమిర్చి, కరివేపాకు వేగాక మసాల ముద్ద, పసుపు, అల్లం వెల్లులి పేస్టు వేసి 7 నిమిషాలు వేయించాలి. పీతల ముక్కలు, కారం, ఉప్పు కలిపి అరకప్పు నీటిని జత చేసి చిన్నమంటపై నీరంతా ఇగిరిపోయి నూనె పైకి తేలేదాక ఉడికించి, కొత్తిమీర చల్లి దించేయాలి.

పులుసు

కావలసిన పదార్థాలు : (శుభ్రం చేసిన పీతలు : 4), ఉప్పు: రుచికి తగినంత. కారం : టీ స్పూన్లు, ఉల్లిపాయ : 1, పచ్చిమిర్చి : 2, చింతపండు: గుప్పెడు (రెండు కప్పుల వేడి నీటిలో నానబెట్టి ఉంచాలి), కొత్తిమీర తరుగు : అరకప్పు, నూనె : ఒకటిన్నర టేబుల్ స్పూను.

మసాల కోసం : కొబ్బరి తరుగు : 2 టేబుల్ స్పూన్లు, ఉల్లిపాయలు : 4 (పొడుగ్గా కట్ చేయాలి). దనియా, జీరా, గరం మసాలా పొడి : 1 టీ స్పూను చొప్పున, అల్లంవెల్లుల్లి పేస్టు : 1 టీ స్పూను (అన్నీ ముద్దలా నూరి పెట్టుకోవాలి).

తయారు చేసే విధానం : నూనెలో ఉల్లి, పచ్చిమిర్చి తరుగు, మసాల ముద్ద, కారం ఒకటి తర్వాత ఒకటి వేగించాలి. శుభ్రం చేసిన పీతల్ని వేసి మూతపెట్టి మగ్గనివ్వాలి. చింతపండు రసం, ఉప్పు వేసి 5 నిమిషాలు ఉడికించి, మంట బాగా తగ్గించి పులుసు చిక్కబడేదాక (కనీసం 30 నిముషాలు) ఉంచి కొత్తిమీర చల్లి దించేయాలి.

సొరకాయ - రొయ్యల కూర

కావలసిన పదార్థాలు : సొరకాయ : అరకిలో, ఎండు రొయ్యలు : 100 గ్రా., పచ్చిమిర్చి : ఐదు, ఉల్లిగడ్డ: పెద్దది ఒకటి, అల్లం, వెల్లులి ముద్ద : ఒక చెంచాడు, ధనియాల పొడి : ఒక చెంచాడు, పసుపు : చిటికెడు, కొత్తిమీర : ఒక కట్ట, నూనె : 50 గ్రా. గరంమసాల : అర చెంచాడు, ఉప్పు : తగినంత.

తయారుచేసే విధానం : ముందుగా ఎండు రొయ్యలను వేయించాలి. తర్వాత వాటి తల, తోక భాగాల్ని తీసి వేసి నీళ్లలో శుభ్రంగా కడగాలి. సొరకాయను చిన్న చిన్న ముక్కలుగా కట్ చేసుకోవాలి. స్టవ్‌పై మరొక గిన్నెలో నూనె పోసి వేడయ్యాక జీలకర్ర, ఆవాలు, పచ్చిమిర్చి, ఉల్లిగడ్డ ముక్కలు, అల్లం వెల్లుల్లి ముద్ద, అర చెంచాడు ధనియాల పొడి, శుభ్రం చేసిన రొయ్యలను అదే నూనెలో వేసి ఉడుకుతుండగానే, దాంట్లో ఉప్పు, గరం మసాలా, కొత్తిమీర వేసి రెండు నిమిషాల తర్వాత దించుకుంటే ఘుమఘుమలాడే 'సొరకాయ–రొయ్యల కూర' తయారైనట్లే!

బిర్యాని

కావలసిన పదార్థాలు : (బాసుమతి) బియ్యం : 250 గ్రాములు, పీతలు (పెద్దవి) : 100 గ్రాములు, వెన్న : 50 గ్రా. ఉల్లిపాయలు : 2, టమోటాలు :2, పచ్చిమిర్చి : 1, జీరా, దనియా, మసాలపొడి : 1 టీస్పూను చొప్పున, కారం : ఒకటిన్నర టీ స్పూను, పసుపు : అర టీ స్పూను, పుదీనా, కొత్తిమీర తరుగు : 1 టేబుల్ స్పూను చొప్పున, ఉప్పు : రుచికి తగినంత, (స్పూను పాలలో నానబెట్టిన) కుంకుమపువ్వు : 4 కాడలు, నెయ్యి : 1 టేబుల్ స్పూను.

తయారు చేసే విధానం : బియ్యంలో కుంకుమపువ్వు కలిపి (పొడిగా) అన్నం వండి పక్కనుంచాలి. కూరగాయల్ని సన్నగా తరగాలి. పీతలలో ఎముకల్ని తీసేయాలి (ఇష్టమైతే 4 పెద్ద ముక్కలుగా కట్ చేసుకోవచ్చు), కడాయిలో వెన్న కరిగించి ఉల్లి, మిర్చి, టమోటా, పుదీనా, కొత్తిమీర తరుగు, జీలకర్ర, కారం, పసుపు, గరంమసాలా పొడులు ఒకటి తర్వాత ఒకటి దోరగా వేగించాలి. తర్వాత పీత ముక్కలు, ఉప్పు వేసి సన్నని మంటపై మూతపెట్టి మగ్గించాలి. పీత (ముక్కలు) ఉడికిన తర్వాత కడాయి దించేయాలి. ఒక లోతైన పాత్రలో ఉడికిన అన్నం, పీత మిశ్రమం ఒకదాని తర్వాత ఒకటి పొరలుగా పరిచి పైన నెయ్యి కొన్ని పుదీనా ఆకులు చల్లి మూతపెట్టి సన్నని మంటపై రెండు నిమిషాలు ఉంచి దించేయాలి.



నీడ ఏదోచ్!



కనుక్కోండి!

హాయ్ పిల్లలూ! ఈ బొమ్మలో ఐదు చేపలు దాక్కొని ఉన్నాయి. అవి ఎక్కడెక్కడ ఉన్నాయో చూసి కనుక్కోండి చూద్దాం!

తేడా ఏది?



ఇక్కడున్న బొమ్మల్లో ఒక్కో వరుసలో ఒక్కో బొమ్మ తేడాగా ఉంది.. అదేంటో కనిపెట్టండి.

పొడుపు కథ

చెయ్యని కుండ
పొయ్యని నీళ్లు
వెయ్యని సున్నం
తియ్యగ నుండు ఏంటది?

గీసేద్దాం!



బొమ్మ సగం వరకే వేశాడు ఆర్టిస్ట్ అంకుల్. అయితే ఆ సగం మీరు గీసేసి బొమ్మను పూర్తి చేస్తారా!

పదాలేవి?

T	N	L	G	N	V	J	A	C	T
G	B	A	U	E	F	H	R	O	P
R	R	Q	T	C	D	B	A	Y	C
A	Z	E	N	R	K	W	I	U	K
F	O	F	E	K	A	D	N	A	J
D	M	P	Y	N	X	I	B	O	W
E	A	I	J	A	M	G	O	L	D
J	R	W	B	F	P	Y	W	G	N
K	C	U	O	N	B	L	I	E	A
S	H	A	M	R	O	C	K	H	E



మీకు ఇంగ్లీషు బాగా వచ్చు కదా...! అలాగు ఆరు ఆంగ్ల పదాలు కూడా ఇచ్చాం.
పైనున్న అక్షర సమూహంలో అవి ఎక్కడున్నాయో కనిపెట్టి సున్నా చుట్టండి.

లెక్కలు చేస్తారా



పైన ఇచ్చిన బొమ్మల కింద అంకెలున్నాయి కదా! అలాగే అవే బొమ్మలు కింద కూడా ఇచ్చాము. మీరు ఆ బొమ్మలకెదురుగా ఉన్న అంకెల్ని వేసుకొని కూడండి...!

గమనిస్తారా?





ఈ రెండు బొమ్మల్ని గమనిస్తే ఆరు తేడాలున్నాయి. అవేంటో గుర్తుపెట్టి మీరు సున్నా చుట్టేయండి.

దారి చెప్పాలి



ఇక్కడో బుల్లి అమ్మాయి వుంది కదా. అక్కడున్న స్టార్స్‌ని పట్టుకోవాలనుకుంటోంది.
కానీ దారి కనబడడం లేదట..! మీరు కనుక్కోగలరా?

◆ కొత్త పుస్తకాలు

భండారి అంకయ్య 'జీవన నానీలు'

ఈ నానీలు గ్రంథాన్ని కవి తన అర్ధాంగి సుశీలా దేవికి ప్రేమానురాగాలతో అంకితం చేశారు. 'నానీల హృదయాంకం పైకి' అంటూ ఆచార్య డా॥ ఎన్. గోపి విలువైన ముందు మాట రాశారు. ఉన్నతోద్యోగి పదవీ విరమణ చేసినా అక్షర విరమణ చేయని భావుకుడు భండారి అంకయ్య. నానీలు ఆవిర్భవించి 17 ఏళ్లు దాటింది కూడా! దాదాపు 230 నానీల సంపుటులు వెలువడ్డాయి. వెయ్యి మంది కవులు 'నానీ'లు రాశారు. ఒక్క కరీంనగర్‌లోనే 50 నానీల సంపుటాలు వెలువడ్డాయి. 'స్నేహ భాండారం' అంటూ మడిపల్లి దక్షిణామూర్తి (ఆకాశవాణి : హైదరాబాద్) గారూ అభినందన పీఠికగా అందించారు. దాదాపు 180 నానీలున్న ఈ పుస్తకంలోంచి మచ్చుకు కొన్ని చూద్దాం!

జీవన నానీలు, కవి : భండారి అంకయ్య, పేజీలు : 60, వెల : రూ. 75/- ప్రతులకు : శ్రీమతి సుశీలాదేవి. ప్లాట్ : 204 : కమలశ్రీ అపార్ట్‌మెంట్స్. రాజీవ్ కాలనీ : మంకమ్మ తోట - కరీంనగర్ - 505001. సెల్ : 9032742937.

జీవితం / కా(రా)దు ఒకరి సొంతం/ పదుగురి కోసం/ బతకడమే పునీతం! (పేజీ. 60). మనిషి ప్రజలకు – వారి సేవకు ఉపయోగపడాలి! అప్పుడే ఆ జన్మ సార్థకం అని కవి చెప్పారు. తెలంగాణం /త్యాగాల పూదోట/ తాకట్టుకు / నేతల సరికొత్త ఆట (పేజీ. 51) దేశ ప్రజలు స్వదేశీ, విదేశీ, పెట్టుబడిదార్లకు భూములు, ఫ్యాక్టరీలు ధారాదత్తం చేయటాన్ని 'నానీ'లో నిరసన చెప్పారు కవి.

తెలంగాణం / నలుదెసలా పూల పూజ/ మత్తెదువు/ చిత్తమోలె బతుకమ్మ/ (పేజీ 44) దసరా సంబరాల్ని గుర్తుకు తెచ్చే బతుకమ్మ ఆటలు, పాటలు, తెలంగాణంలో పెద్ద పండుగ నానీలో ఒదిగించి రాయడం చాలా బాగుంది.

కులం పేరు/ చెప్పుకునేది గుర్తింపుకే/ ఇప్పుడు సకలం/ కుల వలయంలోనే/ అంటారు కవి. రాజకీయాలన్నీ కులం చుట్టే తిరుగుతాయి. రంగు రాయి/ సర్వం మింగేసినంక/ ఊరి పచ్చదనానికి / ఇక చోటెక్కడ/ (పేజీ. 15) ఇది పర్యావరణ స్పృహ పెంచే నానీ. అన్ని కవితలూ సామాజిక ప్రయోజనాన్ని, ప్రగతిశీల భావాల్ని వెల్లడించే రీతిలో ఉన్నాయి.

శ్రీశ్రీ శ్రామిక 'వర్గకవి'

మహాకవి శ్రీశ్రీపై చాలామంది చాలా పుస్తకాలు రాశారు. రాస్తున్నారు. శ్రీశ్రీ సాహిత్యాన్ని, సాన్నిహిత్యాన్ని, వ్యక్తిగతాన్ని అక్షరీకరించారు. వందల బులెటన్లు వేశారు. తన జీవితాన్ని అనంతంలో కుండబద్దలు కొట్టినట్లు శ్రీశ్రీయే... (ఆత్మకథ) రాశారు. విరసం వారు ఆ పుస్తకాన్ని వెలువరించారు కూడా! శ్రీశ్రీ మహాప్రస్థాన కార్యాన్ని కూలంకషంగా అద్దేపల్లి రామమోహన్‌రావు లాంటి సాహిత్యవేత్త 1965లోనే చర్చించి శ్రీశ్రీపై గల వ్యక్తి ఆరాధకుల్ని ఆలోచింపజేశారు. ఆనాటి మార్క్సిస్టులు ... రారా (రాచమల్లు రామచంద్రారెడ్డి) వంటివారు సంవేదనలో అద్దేపల్లిపై విరుచుకుపడితే... సాహిత్యపరంగా అద్దేపల్లి విమర్శన అద్భుతం – అద్దేపల్లి రాసింది కరెక్ట్ అని శ్రీశ్రీయే నిజాయితీగా ఒప్పుకున్నారు. అదో చరిత్ర. 1934 – 47 దాకా రాసిన కవిత్వం 'మహా ప్రస్థానంగా' 1950లో పుస్తకంగా వచ్చింది. ఏ విమర్శకుడైనా కృతి విలువకు ఖరీదు కట్టే షరాబు. సహృదయత విమర్శకుడికి అవసరం. కావాలి కూడా! ఖండాంతర నానా జాతులు – చారిత్రక యదార్థతత్వం చాటిస్తారొక గొంతుతో అన్న శ్రీశ్రీ... తన అభిమానులకు Communism is the

వర్గ కవి శ్రీశ్రీ, రచయిత : బి. హనుమారెడ్డి, పేజీలు : 190, వెల : రూ. 100/- ప్రతులకు : విశాలాంధ్ర బుక్‌హౌస్ బ్రాంచీల్లో. బి. హనుమారెడ్డి - న్యాయవాది- రాజాపానగల్ రోడ్ - ఒంగోలు : 523002. సెల్ : 9440288080

morning song of Humanity అంటూ ఆటోగ్రాఫ్‌లిచ్చేవారు. శ్రీశ్రీ శ్రామిక 'వర్గ కవి'...

శ్రీశ్రీ భావజాలం, శ్రీశ్రీ కవిత్వ వస్తువు , శ్రీశ్రీ కవిత్వం, భాష, వస్తు సమకాలీనత ముందు తరం, తన తరం, అంతర్జాతీయ దృక్పథమా? గొప్ప కవితలు, వ్యక్తిత్వం, కవిత్వం, అనే విభాగాలుగా విభజన చేసి హనుమారెడ్డి తన అభిప్రాయాల్ని 'వర్గకవి'గా శ్రీశ్రీ అభివర్ణిస్తూ రాశారు. ఈ పుస్తకం అధ్యయనం చేసిన సందర్భంలో చేమకూరి వెంకట కవి మాటలే గుర్తుకు వస్తాయి. శ్రీశ్రీపై పుస్తకాలు వెలువరించిన వారి విషయాల్ని రచయిత చర్చించడం అధ్యయనశీలతకు నిదర్శనం... ఒక కవిని, అతని కవిత్వాన్ని, అతని వ్యక్తిత్వాన్ని, వ్యక్తిగత జీవితాన్ని ఎలా మూల్యాంకనం చేయాలో ఈ 'వర్గకవి' అధ్యయనం ద్వారా తెలుస్తుంది. ఈ పుస్తకానికి ఆచార్య ముదిగొండ శివప్రసాద్ 'హనుమన్న న్యాయవాదం' అంటూ రచయిత అంతరంగాన్ని ఒడిసి పట్టుకొని వివరణాత్మకంగా శ్రీశ్రీపై తన అభిప్రాయాలను సైతం సెలవిస్తూ ముందు మాట రాశారు. శ్రీశ్రీని తెలుసుకోవాలి అనుకొనే వారు శ్రీశ్రీ అభిమానులు అధ్యయనం చేయాలి ఈ 'వర్గకవి'ని.

- తంగిరాల చక్రవర్తి

పింకీ పుట్టినరోజు

మూలం:
ప్రకాష్ మను
తెలుగు:
వేదుల రామకృష్ణ

ఆ రోజు ఉదయం పింకి వాళ్ళ అమ్మ, నాన్న ఆఫీసుకి తయారౌతున్నారు.

పింకీ:(దిగాలుగా) ఇదేంటి మమ్మీ? నువ్వు కూడా ఆఫీసుకా? నా పుట్టినరోజు సంగతేంటి?

అమ్మ:(బుజ్జగిస్తూ) పింకీ, సాయంత్రం ఆరుకల్లా రావటానికి ప్రయత్నిస్తా. నీ స్నేహితులను ఏడు గంటలకు రమ్మని చెప్పు.

పింకి:(కాస్త గాభరాగా) వాళ్ళంతా దూరంగా ఉంటారు. శీతాకాలంలో సాయంత్రం తొందరగా చీకటి పడుతుంది. వాళ్లు కూడా తొందరగా వెళిపోతారు. పుట్టిన రోజు సరదాయే ఉండదు. జల్ది రా.

అమ్మ:(బాధగా) ఏం చేయను పింకీ, ఆఫీసులో ఎవరికీ సెలవ దొరకదు. నాన్న కూడా రావటం కష్టమే. సాయంత్రం ఎంజాయ్ చేద్దాం.

పింకి:(ఏడుపు మొహంతో) సరే మమ్మీ.

(కొద్ది సేపటికి పింకీ వాళ్ల అమ్మానాన్న ఆఫీసులకు బయల్దేరారు. పింకి టాటా చెప్పింది.)

✡✡✡

ఇంట్లో పింకీ వంటరిగా వుంది. నాన్న కంపెనీలో మేనేజరు. రాత్రి పదకొండుకి వస్తాడు. అమ్మకీ ఆఫీసే. పింకి చికాగ్గా పచార్లు చేస్తోంది. ఇంతలో మెట్లమీద చప్పుడు .. ఆ తర్వాత తలుపు తట్టిన శబ్దం అయ్యాయి. పింకీ ఆనందంగా గడియ తీయగానే... ఆమె స్నేహితుల బృందం 'హ్యాపి బర్త్‌డే టు యు' అంటు జొరబడింది.

పింకీ (గెంతులేస్తూ): మిమ్మల్ని ఎలా పిలవాలా అనుకుంటున్నా. డాడీ రాత్రి ఆలస్యంగా వస్తారు. మమ్మీ ఆరేడుకి కాని రాదు. కాని మీరు మంచి పని చేశారు. పిలవకుండానే వచ్చేశారు.

గుంజన్:(చలాకీగా) మా ముద్దుల గుమ్మ పింకీ పుట్టిన రోజుకి మాకు పిలుపు కావాలా?

పింకీ:(ఉత్సాహంగా) నిజంగానే, మీరంతా రావటంతో నాకంతా బాగా అనిపిస్తున్నది.

చున్‌మున్:(నవ్వుతూ) సరే అందరం కలిసి డాన్స్ చేసి నీ పుట్టినరోజు జరుపుకుందాం.

చినియా: (కళ్ళు మిటకరిస్తు) కాని మేం నీ కోసం ఏమి కానుకలు తెచ్చామో మాత్రం అడగకు.

చున్‌మున్: చూడాలని వుందా? చెప్పు.

పింకీ: (ఆనందంగా) అవునవును. ఎందుకుండకూడదూ?

(ఇక రంగు రంగుల ప్యాకెట్లలో దాగివున్న ఆనందాలు బయటకి రాసాగాయి. అందరు విప్పి ప్యాకెట్లు చూపించ సాగారు. గుంజన్ తను తెచ్చిన బొమ్మని బయటకు తీసింది. మీట నొక్కగానే అది గౌను చాచి డాన్స్ చేయసాగింది. 'హ్యాపీ బర్త్‌డే టు యూ' పాట రాసాగింది...)

పింకీ:(నవ్వుతూ) అరే వా, బొమ్మ చాలా గొప్పగా ఉందే!

చినియా: పింకీ, నీకు డ్రాయింగంటే ఇష్టం కదా. ఈ చక్కటి పెయింటింగ్ తెచ్చాను. కొండల మధ్య అందమైన సరస్సు వుంది. చూడోసారి.

పింకీ: (ఉత్సాంగా) వా, చాలా చక్కటి పెయింటింగు.

బర్ఖా:నేను ఆకుపచ్చ గీతలున్న ఒక చక్కటి డైరీ తెచ్చాను. దీన్లో ప్రతి పేజీకి ఒక పెయింటింగు వుంది.

పింకీ: (చిలకలా) ఇది చాలా మంచి డైరీ. నేను దీన్లో కవితలు రాస్తాను.

లతిక: (నాటకీయ భంగిమలో) మిస్ పింకి, నా తరపున చక్కటి కళాత్మకమైన గణేశుడి విగ్రహం నీకు కానుకగా ఇవ్వబడుతున్నది.

చున్‌మున్: ఇదుగో చక్కటి పెన్ను సెట్టు. దీంతో బర్ఖా ఇచ్చిన డైరీలో బాగా కవితలు రాసుకో.

పింకీ: వావా, ఎంత బాగుందో, మీరందరు నన్ను ఇంతలా గుర్తు పెట్టుకున్నారు. థ్యాంక్స్.

పింకీ:(ఆనందంతో ఊగిపోతూ) మీకు తెలుసా, కొద్ది సేపు ముందు కూడా నా పుట్టిన రోజు గురించి నేనెంత దు:ఖంలో ఉన్నానో. కాని ఇప్పుడంతా ఆనందమే అనిపిస్తున్నది.

(పిల్లలంతా మళ్ళీ మళ్లీ నీ పుట్టినరోజు రావాలి, ఆనందాలు తేవాలి అని పాడారు.)

పింకీ: (ఆనందంతో) మీకోసం తినటానికి తెస్తాను. బ్రెడ్డు, బిస్కట్లు, పళ్లు ఉన్నాయి. మమ్మీ చేసిన క్యారట్ హల్వా కూడా ఉంది.

లతిక: ముందు మనం ఏమైనా చేసుకుని తిందాం. ఆ తరువాతే అవి.

(అందరు వంటింట్లోకి చొరబడ్డారు. వేడి వేడి పకోడీలు, ఉడికించిన ఆలుగడ్డలతో చాట్ చేసుకుని తిని ఆ తరువాత క్యారట్ హల్వా కూడా లాగించేశారు. తరువాత కబుర్లు మొదలయ్యాయి.)

చినియా: నేను పాట పాడతాను. హ్యాపి బర్త్‌డే టు పింకి... (అందరు కోరస్ అందుకున్నారు.)

బర్ఖా: నేను జోకు చప్తాను. పింకి అనే ఒక అమ్మాయి తన పుట్టినరోజు నాడు దిగాలుగా ఉంది. స్నేహితులకు ఆహ్వానం కూడా పంపలేదు. కాని స్నేహితులే వాళ్ళింటిపై వచ్చి పడ్డారు. ఇంట్లో ఉన్నవన్నీ తినేశారు.(అందరు నవ్వుతారు.)

లతిక: నేనూ ఒక జోకు చెప్తాను. పింకి పుట్టినరోజుకి వాళ్ళమ్మ చాలా పిండివంటలు చేసి స్నేహితులను పిల్చుకోమన్నది. పింకి మాత్రం స్నేహితులు వస్తే అంతా వాళ్ళే తినేస్తారని వాళ్ళని పిలవనని, అంతా తనే తినేస్తానని చెప్పింది.

(అందరు జోరుగా నవ్వేశారు.)

✡✡✡

సాయంత్రం ఏడు గంటలకు పింకీ వాళ్ల అమ్మ వచ్చింది. అలసిపోయి ఉంది.

అమ్మ:(వస్తూనే బరువు గొంతుతో) నేను చాలా అలసి పోయాను పింకీ! నీ స్నేహితులు ఎప్పుడొస్తారో చెప్పు.

పింకీ:(నవ్వుతూ) వాళ్ళు వచ్చి కూడా వెళ్లిపోయారు. ఇంద, నువ్వు కూడా ఆలుగడ్డల చాట్ తిను.

(అమ్మకు పూర్తి కథంతా చెప్పింది పింకీ. ఆమె హాయిగా నవ్వేసింది.)

అమ్మ: (ఆనందంగా చాట్ తింటూ) హ్యాపీ బర్త్‌డే టు యూ పింకీ. చల్లగా ఉండాలి. చదువులో ఫస్ట్ రావాలి.

(స్నేహితులు తనకు ఇచ్చిన కానుకలన్నీ అమ్మకి చూపించింది పింకీ)

✡







ముఖ చిత్రం

జీవితం అన్నాక కూసింత కళాపోషణ వుండాల్సిందే. ఎప్పుడూ ఒకే రకంగా చప్పగా వుంటే ఏం బావుంటుంది చెప్పండి? అనుకున్నట్టుంది బ్రిటన్‌కు చెందిన అలంకరణ నిపుణురాలు బెలిండా. ఆ ఆలోచన నుంచి వచ్చినవే మీ ముందున్న ముఖాకృతులు. సుందర...సుకుమార...సుగంధ భరితమైన సుమాల నుంచి ... ఒకే ఒక్క గర్జనతో గుండెలు అదరగొట్టే సింహాల వరకు.. సునాయాసంగా వేసేస్తుంది. కాకపోతే 'ఏ బొమ్మ వేయాలబ్బా...?' అన్నదానికే ఎక్కువ సమయం తీసుకుంటుంది. ఒక్కోసారి వారం రోజులు కూడా పట్టొచ్చు. వేయడానికి మాత్రం రెండు మూడు గంటలు చాలు. అది అనుకున్న బొమ్మ మీద ఆధారపడి వుంటుందనుకోండి. ఆ తర్వాత ఫొటోలు తీసుకోవడానికి మరో గంట. ఇందుకు కావాల్సిందల్లా కదలక మెదలక సహకరించే మోడల్, అందమైన రంగులు. అంతే. ఇక అదరగొట్టేస్తుంది బెలిండా బొమ్మాళి. ఈ ముఖచిత్రాలను చూస్తుంటే...కొద్దిగా భయం...వణుకు...లాంటివి కలిగినా ఆశ్చర్యం లేదు. నవరసాల్లోని భయానకాన్ని కూడా ఆస్వాదించగలగాలి కదా.

✡